TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

శనివారం, సెప్టెంబర్ 12, 2026	సంపుటి - 20	సంచిక 343	వెల - 4రూ	పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

బీసీల జనాభా లెక్కలు తేల్చాలి.. కులగణన చేపట్టాలి

బీసీల రిజర్వేషన్లు దానం కాదు..
హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాట ఫలితం
కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్

హైదారాబాద్ : దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావా లంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో 2లో

పాలనలో స్పీడ్ పెరగాల్సిందే



నెలరోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి
జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు
ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు

అమరావతి : ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశం సించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్య మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని 2లో

పూర్తి పారదర్శకంగా
డీఎస్సీ నిర్వహించాం

16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చాం
వైసీపీ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం
దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్
విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విమర్శలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని 2లో

చెరువుల హద్దులకు
రక్షణ కవచం

మత్స్యకారుల బతుకులకు భరోసా

- ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం
- అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- నెల్లికల్ ఎత్తిపోతల పథకంపై సభాముఖంగా విస్పష్టమైన హామీ
- జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు
- పీడీఎస్‌లో అదనపు నిత్యావసర సరుకుల పంపిణీపై సానుకూల పరిశీలన
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువుల పూర్తి నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా ప్రకటించారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణలకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు.

హైదారాబాద్ : సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. "చెరువులు, వాటి ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణకు నేను సంపూర్ణ ంగా కట్టుబడి ఉన్నాను. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, ఆక్రమణలు జరిగినా, మత్స్యకారులకు అన్యాయం వాటిల్లినా నిర్దిష్ట వివరాలను నా దృష్టికి తీసుకురండి. 2లో

ఉద్యోగులకు
ప్రమాద బీమా

కోటి రూపాయల బీమా అందిస్తున్నాం
ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా
ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ధి
అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

హైదారాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటు వంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచన తోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని 2లో

రేవంత్‌రెడ్డి, పొంగులేటి
రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు
బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
మంత్రి పొంగులేటి రాజీనామాకు హరీష్ రావు డిమాండ్
తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో సమావేశం

హైదారాబాద్ : తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్ వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తరువాయి 2లో

రైతులకు యాంత్రీకరణ పథకం

రైతు కోరుకున్న పనిముట్టు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు
సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ
మండలిలో మంత్రి తుమ్మల సమాధానం

హైదారాబాద్ : రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడంతో పాటు, వారి అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలను అందుబాటులోకి తీసుకు రావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాసన మండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ 2లో

తెలంగాణలో
నకిలీ పన్నీర్
బంద్

ఏడాది పాటు అనలాగ్ పన్నీర్‌పై నిషేధం
ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ

హైదారాబాద్ : హోటళ్లు, దాబాలు, రోడ్డు పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పన్నీర్ బట్టర్ మసాలా, పన్నీర్ టిక్కా అంటూ లొట్టలేసుకుని లాగించే భోజన ప్రియులకు తెలంగాణ ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తున్న కృత్రిమ, నాన్-డైరీ అనలాగ్ పన్నీర్ దందాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు ఉక్కుపాదం మోపింది. ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రమాదంలో పడేస్తున్న ఈ కృత్రిమ పన్నీర్ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పాటు పూర్తి నిషేధం విధిస్తూ రాష్ట్ర ఆహార భద్రతా శాఖ కమిషనర్ గురువారం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006లోని 2లో

ఉద్యోగులకు ప్రమాద బీమా

బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ??ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో ?సింగరేణిలో 50, ?విద్యుత్ శాఖ ఉద్యోగులు 15, ?వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారన్నారు. ??శాలరీ, పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. ?రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఉచిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది , 2,72,615 మంది పెన్షనర్లు కవర్ అవుతారని వివరించారు. ఈ పథకాన్ని మొదటిగా ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభలో తెలిపారు.

పాలనలో స్పీడ్ పెరగాల్సిందే

ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

తెలంగాణలో నకిలీ పన్నీర్ బంద్

సెక్షన్ 30(2)(ఎ) కింద ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. అసలైన పన్నీర్‌ను ఆవు లేదా గేదె పాలతో తయారు చేస్తారు. అయితే, కొందరు కల్తీ రాయుళ్లు అధిక లాభాల కోసం చుక్క పాలు కూడా వాడకుండా పామాయిల్, చౌకైన వెజిటబుల్ ఫ్యాట్స్, పిండి పదార్థాలు, రసాయనాలు కలిపి అచ్చం పన్నీర్‌లా ఉండే అనలాగ్ పన్నీర్ ను తయారు చేస్తున్నారు. చూడటానికి, రుచికి ఇది అసలు పన్నీర్‌లాగే ఉండటంతో సామాన్య ప్రజలు తేడాను గుర్తించలేకపోతున్నారు. మార్కెట్లో అసలు పన్నీర్ ధరకు సగానికే ఇది లభిస్తుండటంతో హోటళ్లు, బేకరీలు, రోడ్ సైడ్ ఫుడ్ సెంటర్లు వీటిని విచ్చలవిడిగా కొనుగోలు చేసి వినియోగదారులకు వడ్డిస్తున్నాయి. ఈ అనలాగ్ పన్నీర్ వాడకం వెనుక తీవ్రమైన ఆరోగ్య ముప్పు దాగి ఉందని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెజిటబుల్ ఫ్యాట్స్, రసాయనాల మిశ్రమంతో కూడిన ఈ కల్తీ పన్నీర్‌ను క్రమంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ విపరీతంగా పెరిగిపోయి గుండెజబ్బులు, కాలేయ సమస్యలు , జీర్ణకోశ వ్యాధులు తలెత్తుతాయి. దీర్ఘకాలంలో ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆహార భద్రతా టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు దిగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అనలాగ్ పన్నీర్‌ను తయారు చేసినా, హోటళ్లకు సరఫరా చేసినా లేదా విక్రయించినా బాధ్యులపై ఆహార భద్రతా చట్టం కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కమిషనర్ తీవ్ర హెచ్చరిక చేశారు. అయితే, పూర్తి నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన పాలతో తయారయ్యే సాధారణ డెయిరీ పన్నీర్ విక్రయాలకు ఈ నిషేధంతో ఎలాంటి సంబంధం లేదని అధికారులు స్పష్టత ఇచ్చారు. హోటళ్లు, రెస్టారెంట్లు తాము వాడుతున్న పన్నీర్ నాణ్యతను నిరూపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పటికే హోటళ్లు, తయారీ యూనిట్లు, ప్రాసెసింగ్ ప్లాంట్లపై ఆకస్మిక దాడులు ప్రారంభించారు. రసాయనాలతో పన్నీర్ తయారు చేసే ముఠాల సమాచారం సేకరిస్తూ శాంపిళ్లను ల్యాబ్‌లకు పంపుతున్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫుడ్ సెంటర్లపై ఆహార భద్రతా శాఖకు టోల్ ఫ్రీ నంబర్ లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ నిర్ణయంతో నగరంలో కల్తీ పన్నీర్ దందాకు అడ్డుకట్ట పడుతుందని సగటు పౌరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం

అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

చెరువుల హద్దులకు రక్షణ కవచం

ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి సభకు భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. జలవనరుల ఆరోగ్యంతోనే మత్స్యకారుల జీవనోపాధి ముడిపడి ఉన్నందున, చెరువుల పర్యవేక్షణ, చేప పిల్లల సంరక్షణ, ఆక్రమణలు లేదా ఇతర ముప్పులను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మత్స్యకార సంఘాలు స్థానిక సంరక్షకులుగా సమర్థవంతమైన పాత్ర పోషించగలవని సూచించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇటువంటి కమిటీలు పనిచేశాయని, అనంతర కాలంలో ఆ వ్యవస్థ నిలిచిపోయిందని తెలిపారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ సమగ్ర సమాచార వ్యవస్థ చెరువుల స్థితిగతులను పర్యవేక్షించడంతోపాటు వాటి పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు బలమైన ప్రాతిపదికగా ఉపయోగపడుతుందని చెప్పారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. చెరువుల సంరక్షణ, ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని పునరుద్ఘాటించారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసన మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. "సభాముఖంగా విస్పష్టమైన హామీ ఇస్తున్నాను. మొదటి దశను జూన్ 2027 కంటే ముందుగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసి, 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులకు కేవలం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు రూ.310.681 కోట్లు విడుదల చేసి, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు పనులకు వేగం పెంచిందన్నారు. తాను స్వయంగా రెండుసార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని, నీటిపారుదల శాఖ కార్యదర్శి కూడా రెండుసార్లు సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. నెల్లికల్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తోపాటు పలువురు సభ్యులు చేసిన సూచనలపై మంత్రి స్పందించారు. పీడీఎస్ పరిధిలోకి అదనపు సరుకులను తీసుకురావడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందుకు అవసరమయ్యే ఆర్థిక భారాన్ని సమగ్రంగా అంచనా వేస్తున్నామని తెలిపారు. "అదనపు నిత్యావసర సరుకుల పంపిణీ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని మంత్రి స్పష్టం చేశారు. సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం ఆహార భద్రతను కల్పిస్తోందని, అయితే పేద కుటుంబాలకు పోషక భద్రతను అందించాలంటే పప్పులు, వంట నూనెలు వంటి సరుకులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని సభ్యులు సూచించారు. దీనివల్ల పేదల ఆహారంలో పోషక విలువలు పెరగడంతోపాటు రాష్ట్రంలో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. చౌకధరల దుకాణాల ఆర్థిక స్థిరత్వం మెరుగుపడి, భవిష్యత్తులో అవి "పేదల సూపర్ బజార్లు"గా రూపాంతరం చెందే అవకాశం ఉంటుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

బీసీల జనాభా లెక్కలు తేల్చాలి.. కులగణన చేపట్టాలి

మంత్రి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని మంత్రి స్పష్టం చేశారు. 1953లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం 1979లో బి.పి. మండల్ కమిషన్ ఏర్పడి దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసిందని, 1990లో ఆ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పడిందని, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా దానికి రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు. రాదీజ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు జస్టిస్ రోహిణి కమిషన్‌ను కూడా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలో సమగ్ర కుల సర్వే చారిత్రక నిర్ణయం-మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఎవరు ఎంతమంది ఉన్నారు? వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? రాజకీయంగా వారి వాటా ఎంత? అనే అంశాలను డేటా ఆధారంగా తెలుసుకునేందుకు సమగ్ర కుల సర్వే నిర్వహించామని తెలిపారు. "ఇది కేవలం ఒక సర్వే కాదు.. సామాజిక న్యాయానికి పునాది. బీసీల హక్కులకు బలమైన ఆధారం" అని మంత్రి పేర్కొన్నారు. "జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్" రాహుల్ గాంధీ నినాదంతో ముందుకుసాగుతున్నాం-మంత్రి వాకిటి శ్రీహరి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్నది సామాజిక సమానత్వమని మంత్రి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన "జిత్నీ ఆబాదీ, ఉత్నా హక్" నినాదం సామాజిక న్యాయానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. జనాభాలో ఎంత వాటా ఉంటే అవకాశాలు, అధికారంలో అంత వాటా ఉండాలనే స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కేంద్రంలో పన్నెండేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల జనాభా లెక్కలు తేల్చడానికి ఎందుకు వెనుకడుగు వేస్తోందని మంత్రి ప్రశ్నించారు. "బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తారు? డేటా లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యం?" అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను స్పష్టంగా చేర్చాలి. బీసీలను లెక్కించాలి.. బీసీలకు న్యాయం చేయాలి" అని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. "కులగణన చేయండి.. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయండి" అని ఆయన కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం

ఆయన ధీమా వ్యక్తం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

రైతులకు యాంత్రీకరణ పథకం

ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు వంటి అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదని, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవని, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టును, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకోకుండా యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసిందని మంత్రి తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం ద్వారా రైతులపై శారీరక శ్రమ తగ్గడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గి, సమయానికి వ్యవసాయ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకం కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌ను అనుగుణంగా, అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను యాంత్రీకరణ పథకం కింద సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అందించే పరికరాలపై ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీని అందిస్తోందని మంత్రి తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు కోరుకునే విధంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేలా ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. కమిటీలో శాస్త్రవేత్తలు, టెక్నికల్ ఇంజనీర్లు, అధికారులతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోలు (ఫ్రూాం) ప్రతినిధులను కూడా భాగస్వాములను చేశామని వివరించారు. రైతుల వాస్తవ అవసరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, వివిధ ప్రాంతాల్లో సాగు విధానాలను పరిగణనలోకి తీసుకుని యంత్ర పరికరాల ఎంపిక జరిగేలా ఈ విధానం రూపొందించామని తెలిపారు. యాంత్రీకరణ పథకం కింద పరికరాలను సరఫరా చేసేందుకు 444 కంపెనీలు ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాయని మంత్రి వెల్లడించారు. అయితే ప్రతి కంపెనీని ఎంపిక చేయడం జరగదని, నిర్దేశిత ప్రమాణాలను పాటించే కంపెనీలను, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత సంస్థలు గుర్తించి ఎంపిక చేసే ప్రమాణాలను అనుసరించే కంపెనీలను మాత్రమే జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. దీంతో రైతులకు నాణ్యత లేని లేదా ప్రమాణాలు లేని యంత్ర పరికరాలు అందకుండా చూడటంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తులకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. యాంత్రీకరణ పథకంలో రైతుకు కొనుగోలు విషయంలో పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు తనకు నచ్చిన పనిముట్టును, తనకు నచ్చిన కంపెనీ దగ్గరే కొనుగోలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల తరఫున ఒక నిర్దిష్ట కంపెనీ నుంచి మాత్రమే యంత్రాన్ని కొనుగోలు చేయాలని నిర్దేశించడం లేదన్నారు. అదేవిధంగా, రైతులు మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రమాణాలకు అనుగుణమైన తమకు నచ్చిన పరికరాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. యాంత్రీకరణ పథకంలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని చెప్పారు. దళారులకు, మధ్యవర్తులకు అవకాశం లేకుండా రైతుకు నేరుగా ప్రయోజనం అందేలా వ్యవస్థను రూపొందించామని తెలిపారు. రైతు తన అవసరానికి అనుగుణంగా పరికరాన్ని ఎంపిక చేసుకుని కొనుగోలు చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, సబ్సిడీ కూడా నేరుగా రైతు ఖాతాలో జమ కావడం ద్వారా పథకం అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో పంటల సాగు విధానాలు, రైతుల అవసరాలలో ఉండే అసమానతల వలన, యాంత్రీకరణకు ఉన్న డిమాండ్ ప్రాంతాల వారిగా భిన్నంగా ఉంటుందని మంత్రి తెలిపారు. అందువల్ల రైతులకు అవసరం లేని పరికరాలను పెద్ద ఎత్తున సరఫరా చేయడం కాకుండా, రైతుల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన యంత్రాలను అందుబాటులోకి ఉంచుతున్నామని స్పష్టం చేశారు. డ్రోన్లు సహా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలకు పెరుగుతున్న డిమాండ్‌ను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.50 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, వచ్చే మూడు సంవత్సరాల్లో మరో 6 లక్షల ఎకరాలను ఆయిల్‌పామ్ సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను కూడా యాంత్రీకరణ పథకం కింద అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న అత్యుత్తమ యంత్ర పరికరాలను గుర్తించి, అవసరమైన వాటిని దిగుమతి చేసుకుని రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఈ యంత్ర పరికరాలను ఫ్యాక్టరీ వద్దే రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తద్వారా ఆయిల్‌పామ్ సాగులో యాంత్రీకరణ పెంచి, రైతుల శ్రమను తగ్గించడంతో పాటు ఉత్పాదకతను పెంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, రైతుల శ్రమను తగ్గించడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయ పనులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు యాంత్రీకరణ కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా, సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శకమైన, రైతు కేంద్రిత యాంత్రీకరణ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

రేవంత్‌రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు.

స్వామి వారిని దర్శించుకున్న పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశి.

ధర్మపురి, సెప్టెంబర్ 11, (ది క్రైమ్ న్యూస్): జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానమునకు శుక్రవారం పెద్దపెల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ముందుగా దేవస్థాన సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికిన అధికారులు పిదప శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం వేద పండితులు అర్చకులు ఆశీర్వచనం అందించారు. తదుపరి దేవస్థానం పక్షాన శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రపటం దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచారి, అర్చకులు నంబి నరసింహమూర్తి, నేరెళ్ల విజయ్ కుమార్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

1.50 కోట్ల విలువైన 11. కిలోల ఆశిష్ ఆయిల్ స్వాధీనం.

సెల్ఫ్ డ్రైవ్ కారుతో అక్రమ దందా నిర్వహిస్తున్న నిందితులు.

వివరాలు వెల్లడించిన మహేశ్వరం జోన్ డిసిపి కె నారాయణ రెడ్డి.

మహేశ్వరం సెప్టెంబర్ 11, (ది క్రైమ్ న్యూస్) : సెల్ఫ్ డ్రైవ్ కారుతో అక్రమ ఆశిష్ ఆయిల్ దందా కొనసాగిస్తున్న నిందితులను అరెస్టు చేసినట్లు మహేశ్వరం డిసిపి కె నారాయణ రెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో కందుకూరు సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించి నిందితుల నుండి 1,50 కోట్ల విలువైన 11 కిలోల ఆశిష్ ఆయిల్ ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఆపరేషన్ ఫ్యూచర్ సిటీ పోలీసులతోపాటు కందుకూరు పోలీసులు పాల్గొన్నట్లు తెలిపారు. నిందితులు లంబసింగి, ఖమ్మం, మిర్యాలగూడ దేవరకొండ కల్వకుర్తి కందుకూరు మార్గం నుండి హైదరాబాద్ కు ఆశిష్ ఆయిల్ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితులు కొత్తపేట నుంచి సెల్ఫ్ డ్రైవ్ షిఫ్ట్ (టిఎస్ 07, హెచ్ టి 6393) కారును అద్దెకు తీసుకొని ఈ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిరంతరంగా కఠిన చర్యలు చేపడుతుందని తెలిపారు. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు నిర్భయంగా తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ ఎస్ఓటి అదనపు డిసిపి షేక్ జాంగిర్ మహేశ్వరం డివిజన్ ఏసిపి ఎస్ జానకి రెడ్డి, కందుకూరు సిఐ, హెచ్ వెంకటేశ్వర్లు. టి రవికుమార్ ఎస్ఓటి సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి ట్రాక్టర్లపై వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్షం నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు బీజేపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ట్రాక్టర్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతుల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విధానంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ ఈ వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు. ఈ ర్యాలీకి బీజేపీ శాసనసభా పక్ష నేతలు, ఎమ్మెల్యేలు , ముఖ్య నాయకులు నేతృత్వం వహించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న వేళ, రైతుల సమస్యలను సభ దృష్టికి మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ బయట ట్రాక్టర్లపై ఎక్కి నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఫసల్ బీమా యోజన ద్వారా వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ర్యాలీగా వస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల ట్రాక్టర్లను అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు పొరుగు రాష్ట్రాలు ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేస్తూ రైతులను ఆదుకుంటుంటే, తెలంగాణలో మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర పథకాన్ని పక్కనబెడుతున్నారని మండిపడ్డారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ఏటా వేలాది మంది రైతులు పంటలు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ. 500 బోనస్, పంటల భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు.

తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం

జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి

కులగణన చేద్దామా వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి

కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..

దేశ సంపద సమాన పంపిణీకి మార్గం

తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి

వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే ను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని, అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు. దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు. జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేర్చుతామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీన వర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కులగణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ?"కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. కులగణనకు అనుకూలమైతే సభ తరఫున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉంటుందని అన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా తెలంగాణలో నిర్వహించిన తరహాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

జూన్ నాటికి ఉప్పల్ నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల వాహనదారులకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి, 2027 జూన్ నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఉప్పల్--నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వరంగల్ వైపు వెళ్లే వాహనాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నప్పటికీ పలు కారణాల వల్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఈ ఫ్లైఓవర్‌ను ఈ ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తీసుకురావాలని గతంలో భావించారు. అయితే కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన సమస్యలు, న్యాయపరమైన అంశాలు తదితర కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రాజెక్టు కాంట్రాక్టర్ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో నిర్మాణ ప్రక్రియలో అంతరాయం ఏర్పడిందని మంత్రి వివరించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు సెకండరీ ఏజెన్సీని రంగంలోకి తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయలేకపోయామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అవరోధాలను తొలగించి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యంతో ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. జాతీయ రహదారి--163పై ఉప్పల్--నారపల్లి మధ్య ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుమారు రూ.425 కోట్ల అంచనా వ్యయంతో 2018లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో మూడేళ్లలోనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ వివిధ కారణాలతో ప్రాజెక్టు గడువు పలుమార్లు పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ కారిడార్ పూర్తయితే ఉప్పల్, నారపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు తూర్పు దిశగా ప్రయాణించే వాహనాలకు గణనీయంగా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని వరంగల్, భువనగిరి, జనగామ ప్రాంతాలతో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌తో అనుసంధానించడంలో ఈ మార్గం కీలకంగా మారనుంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయ అధికారులు, చీఫ్ ఇంజనీర్‌తో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా కొన్ని బీటీ రోడ్డు పునరుద్ధరణ, మరమ్మతు పనులు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి 2027 జూన్ నాటికి ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్--నారపల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు నగర తూర్పు వైపు విస్తరిస్తున్న ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ మెరుగుపడే అవకాశం ఉంది.

జీహెచ్ఎంసీకి యాడ్ ఏజెన్సీల భారీ బకాయి

అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్ఎంసీకి సుమారు రూ. 39.74 కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది. ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521 అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది. అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్-2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో, ఇన్‌ఛార్జ్ నేరుగా ఆమెతో మాట్లాడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని, చర్చను రేకెత్తిస్తోంది. ఈ ఫోన్ సంభాషణ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన కొన్ని వ్యక్తిగత అంశాలు మరియు అంతర్గత విభేదాలను పూర్తిగా పక్కనపెట్టి, భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లో తిరిగి ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ ఆమెకు గట్టిగా సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం విదితమే. ఆ తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు ఆమె హాజరుకాకపోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పాడి రంగం బలోపేతానికి ప్రజా ప్రభుత్వం చర్యలు

పాడి రైతులకు గిట్టుబాటు ధర.. గోపాలమిత్రలకు సంక్షేమ సౌకర్యాలు

మధిర, కొడంగల్‌లో సెర్ఫ్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ

పశుసంవర్ధక శాఖలో 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు..

పెరుగుతున్న పాల ఉత్పత్తి-మంత్రి వాకిటి శ్రీహరి

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, పాడి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం శాసనసభలో సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2024--25లో 59.35 లక్షల టన్నులు, 2025--26లో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. 2026--27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు. పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు ప్రతి కిలో వెన్నతో పాటు మొత్తం ఘనపదార్థాల ప్రాతిపదికన రూ.340 ధరలను నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన పాల సేకరణకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పాడి రంగాన్ని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ఫ్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాడి పశువుల సంఖ్యను పెంచడంతో పాటు, రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా పాడి ఆధారిత జీవనోపాధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. పాడి రంగంలో క్షేత్రస్థాయిలో కీలక సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశువుల ఆరోగ్యం, పాడి రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పాడి వ్యవస్థ బలోపేతంలో గోపాలమిత్రల పాత్ర కీలకమని మంత్రి అన్నారు. పశుసంవర్ధక శాఖలో సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాడి పరిశ్రమలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రత్యేకమైన ప్రతిపాదన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే పశువుల ఆరోగ్యం, పాల నాణ్యత, వినియోగదారుల భద్రత, పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కర్ణాటకలోని నందిని డెయిరీతో పోలిస్తే తెలంగాణలో విజయ డెయిరీ ద్వారా పాడి రైతులకు ఎక్కువ ధరలు చెల్లిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచడం, పాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, విజయ డెయిరీని మరింత బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ పాడి రంగానికి కొత్త దిశను చూపిస్తామని మంత్రి పేర్కొన్నారు. "పాడి రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. పాడి పరిశ్రమ బలోపేతమే గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాది" అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి

అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

హైదారాబాద్, సెప్టెంబర్ 11 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు.

సంపాదకీయం

మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండలంలోని పుల్గర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే ముమ్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సంక్లిష్టతల్లో బ్రిక్స్ శక్తి ఎంతవరకు?

న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో బ్రిక్స్ 18వ వార్షిక సదస్సుకు భారీ ఎత్తున సర్వసన్నాహాలు సిద్ధమయ్యాయి. 2009లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలతో ప్రారంభమైన ఈ కూటమిలో 2011లో దక్షిణాఫ్రికా చేరింది. ప్రస్తుతం ఈ కూటమిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు కూడా భాగస్వామ్యం వహిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది ఈ కూటమికి వర్తించడం విశేషం. అలాగే కొనుగోలు శక్తి సమానత్వం ఆధారంగా ప్రపంచ జిడిపిలో సుమారు 40శాతం ఈ కూటమి దేశాలదే అని అంచనాలు చెబుతున్నాయి. ఇంత విస్తృత సామర్థ్యం కలిగిన ఈ కూటమి తగినంత ప్రభావాన్ని చూపడం లేదు. బ్రిక్స్ తాను ఏ రూపంలో ఉండాలనుకుంటుందో ఇంకా స్పష్టంగా నిర్ణయించుకోలేకపోతోంది. ఒక బలమైన కూటమిగా ఉండాలా? చర్చల్లో ఒత్తిడి తెచ్చే సాధనంగా ఉండాలా? లేక ఇంకా నెరవేరని బహుళ ధ్రువ ప్రపంచం కోసం ఎదురు చూసే వేదికగా ఉండాలా? అన్న ప్రశ్నలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇప్పుడు సదస్సు జరుగుతున్న సమయం చూస్తే చాలా సంక్లిష్టమైన వాతావరణం కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుతనం, ఆకస్మిక దౌత్య విధానాల వల్ల బ్రిక్స్ కూటమి లోని కొన్ని సభ్యదేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవం. అసలు బ్రిక్స్ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశం పాశ్చాత్య దేశాల ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా అనేక దేశాలు కలిసి సంఖ్యాబలంతో తమ శక్తిని పెంచుకోవడం. అయితే ఇప్పటివరకు ఇది అగ్నిపరీక్షగానే ఉంటోంది. అయితే భారత్ ఈ సదస్సును కేవలం ఆతిథ్యం ఇచ్చే బాధ్యతగా మాత్రమే కాకుండా దౌత్యపరంగా ఎంతో ముఖ్యమైన అవకాశంగా భావిస్తోంది. మధ్యప్రాచ్యం, ఐరోపాలో కొనసాగుతున్న యుద్ధాల కారణంగా అంతర్జాతీయ దౌత్య పరిస్థితులు అత్యంత క్లిష్టంగా మారిన సమయంలో సదస్సుకు ముందు కొన్ని వారాల క్రితమే భారత్ చురుకైన దౌత్య ప్రయత్నాలు ప్రారంభించింది. సోషల్ మీడియా ఉచ్చులో చిన్నారులు ఆగస్టు 24న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ప్రధాని నరేంద్ర మోడీ వ్యక్తిగత సందేశాన్ని రష్యా అధ్యక్షులు పుతిన్‌కు అందించేందుకు క్రెమ్లిన్ వెళ్లారు. మరుసటి రోజు ఆగస్టు 25న, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తో సమావేశమయ్యారు. ఆగస్టు 31న కిర్గిజిస్థాన్ లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సు సందర్భంగా మన ప్రధాని మోడీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. అలాగే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కూడా చర్చలు జరిపారు. పెజెష్కియాన్ హాజరు కావడం ద్వారా అమెరికా చేస్తున్న కొన్ని వాదనలకు భిన్నంగా, ఇరాన్ రాజకీయ నాయకత్వ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందన్న సూచనలు కనిపించాయి. మనిషిని బట్టి మారుతున్న న్యాయం ౼ుంజవతీఅంవఎవత్ ఈ సదస్సును రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, క్లిష్టమైన అంతర్జాతీయ పరిస్థితుల్లో తన దౌత్యపరమైన ప్రభావాన్ని పెంచుకోవడానికి భారత్ ఉపయోగించు కుంటుంది. అయితే ఈ ప్రయత్నాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బ్రిక్స్ ఏర్పడినప్పటి నుంచి సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాల కారణంగా అది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఎందుకంటే సభ్యదేశాల ప్రయోజనాలు చాలా సందర్భాల్లో ఒకదానితో మరొకటి సరిపోలవు. భారత్, చైనాలకు ఎప్పటి నుంచో పరస్పరం పోటీ పడే వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని సభ్యదేశాలు చైనా ఆర్థిక ఆధిపత్యంపై ఆందోళనతో ఉన్నాయి. 2022 నుంచి ఈ పరిస్థితిలో కీలకమైన మలుపు వచ్చింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి కారణంగా పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించినప్పుడు బ్రిక్స్ దేశాలు తమ నియంత్రణలో లేని ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎంతగా ఆధారపడి ఉన్నాయో స్పష్టమైంది. 'జిడిపి వృద్ధి' అందరికీ అందుతుందా? ఒక ప్రత్యర్థి శక్తిపై ఆంక్షలు విధించడం వల్ల, అమెరికా నియంత్రణకు బయటగా ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలు, బ్యాంకింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం స్పష్టమైంది. అయినప్పటికీ బ్రిక్స్ కూటమి ప్రధాన దృష్టి రాజకీయాలపై కాకుండా, ఆర్థిక, సాంకేతిక అంశాల పైనే కొనసాగుతోంది. భవిష్యత్తులో కూడా బ్రిక్స్ ప్రధానంగా వాణిజ్యం, ఆర్థిక వ్యవహారాలు, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాల పైనే దృష్టి కేంద్రీకరించే అవకాశం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఇరాన్‌పై అమెరికా చేసిన సైనిక దాడులను అధికారికంగా ఖండించాలని ఇరాన్ కోరుతోంది. యుద్ధ చర్యలను పూర్తిగా నిలిపివేయాలని, విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, హర్మూజ్ జల సంధిని తిరిగి తెరవాలని కోరుతూ వెలువడనున్న ప్రాథ మిక ప్రకటనపై సభ్యదేశాలు ఎంతవరకు ఏకీభవిస్తాయో చూడాల్సిందే. బ్రిక్స్‌లో రష్యా చైనా ఇరాన్ ప్రభావం పెరుగుతోంది. కానీ భారత్ మాత్రం పాశ్చాత్య దేశాలతోనూ, ఇజ్రాయెల్ తోనూ సంబంధాలు కొనసాగిస్తోంది. కాబట్టి బ్రిక్స్ కూటమిలో తన స్థానం, తన స్వతంత్ర విదేశాంగ విధానం. పాశ్చాత్య దేశాలతో సంబంధాలు ఈ మూడింటినీ భారత్ ఎలా సమతుల్యం చేస్తుందనేదే ప్రధాన సమస్య. భారత్ అమెరికా వైపు, లేదా చైనా, రష్యా వైపు పూర్తిగా మొగ్గు చూపకుండా తన ప్రయోజనాలకు అనుగుణంగా ప్రతి దేశంతో వేర్వేరు అంశాల్లో కలిసి పనిచేయాలన్న వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని అనుసరిస్తోంది. బ్రిక్స్ తన ప్రాముఖ్యతను కోల్పోకుండా ఉండాలంటే భారత్ ఎంతో సమర్థంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. బ్రిక్స్ భవిష్యత్తులో నిజంగా ఎంత శక్తివంతమైన కూటమిగా మారగలదో సభ్యదేశాల వైఖరిపై ఆధారపడి ఉంటుంది.

రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు

తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ

జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

న్యూఢిల్లీ : తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఏ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు

కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

నామ స్మరణమే.. శరణం!

ప్రపంచవ్యాప్తంగా భక్తులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. సర్వాకర్షకుడైన శ్రీకృష్ణుడి ఆవిర్భావ లీలనే కృష్ణాష్టమి. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భగవానుడి దివ్య ఆవిర్భావాన్ని స్మరించుకుంటూ, ఆయన అపార కరుణను అనుభూతి చెందేందుకు ఒక మహత్తర అవకాశం. ఈ పవిత్ర దినం మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపి, భగవంతుడితో మన సనాతన సంబంధాన్ని గుర్తు చేస్తుంది. శ్రీకృష్ణుడి జననం సాధారణ శిశువుల వలె సంభవించినది కాదు. వాస్తవానికి ఆయన పుట్టుక లేనివాడైనప్పటికీ, తన ఆంతరంగిక శక్తితో ఈ లోకాన అవతరించడం భగవానుడి దివ్య లీలల్లో ఒకటి. దేవాదిదేవుడు, పరబ్రహ్మం, సర్వశక్తిమంతుడైన శ్రీకృష్ణుడు కేవలం ఆయన స్వీయ సంకల్పం మేరకే లోకంలో అవతరిస్తాడు గానీ, భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. మథురలోని కంసుడి కారాగారంలో దేవకీ వసుదేవులకు జన్మించినప్పుడు, శ్రీకృష్ణుడు శంఖ, చక్ర, గదా, పద్మాలతో చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. తల్లి దేవకి ప్రార్థన మేరకు ఒక సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. శ్రీకృష్ణుడు అవతరించిన ఆ శుభ ఘడియలలో లోకమంతా ఆనందం, శాంతి నెలకొని, దిక్కులన్నీ ప్రసన్నమైనట్టు శ్రీమద్భాగవతం చెబుతుంది. అవతార లక్ష్యం.. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించేందుకు తాను యుగయుగాన అవతరిస్తానని శ్రీకృష్ణుడే స్వయంగా ప్రకటించాడు. అంతేగాక, ఆయన జీవితం, లీలలు, బోధనలు మానవాళికి గొప్ప సందేశాన్ని అందిస్తాయి. శ్రీకృష్ణుడు కేవలం ఏడేళ్ల వయసులో తన చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని ఎత్తి, దానిని ఏడు రోజుల పాటు నిలబెట్టాడు. ఇది ఆయన అసాధారణ శక్తిని, మనం ఆయన్ని ఒక సాధారణ మానవుడిగా చూడకూడదని నిరూపిస్తుంది. ఆయన లీలలు ప్రాపంచిక మాలిన్యాలకు అతీతమైనవి. శ్రీకృష్ణుడి జననం, కర్మల దివ్యత్వాన్ని తెలుసుకున్నవారు ఈ భౌతిక ప్రపంచంలోకి తిరిగి రారు, శాశ్వత ధామాన్ని చేరుకుంటారు. మానవ జన్మకు అంతిమ లక్ష్యం భగవంతునితో ప్రేమపూర్వక సంబంధాన్ని పునరుద్ధరించుకోవడమే! భగవద్గీతలో శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన పరమ సందేశం 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' (సమస్త ధర్మాలను త్యజించి నన్నే శరణు పొందు). ఇది మోక్షాన్ని పొందే అత్యంత సరళమైన మార్గం.



ఆధ్యాత్మికం

జన సాధారణ్ పేరుతో... జనాలకు దూరంగా!

- పేరు జన సాధారణ్.. హాల్టులు మాత్రం పరిమితం!
- పేదల కోసం అన్నారు.. పేదలు ఎక్కే చోటే ఆపలేదేంటి ?
- ఒక్కరోజు స్పెషల్.. ప్రచారం మాత్రం పర్మినెంట్!

బ్యూరో్,: సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్ మార్గంలో ఒక్కరోజు నడిపిన 07235/07236 జన సాధారణ్ స్పెషల్ ఇప్పుడు మరో ప్రశ్నను లేవనెత్తుతోంది. పేరు మాత్రం "జన సాధారణ్"... కానీ సాధారణ ప్రయాణికుడికి నిజంగా ఎంతవరకు అందుబాటులోకి వచ్చింది? అన్‌రిజర్వ్డ్ ప్రయాణికుల కోసం నడిచిన ఈ స్పెషల్‌కు పరిమిత హాల్టులే ఇవ్వడంతో మధ్యలోని అనేక ప్రాంతాల ప్రజలకు ఈ రైలు ఉపయోగపడే అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా పేదలు, కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు ఆధారపడే చిన్నా మధ్యస్థ స్టేషన్లకు హాల్ట్ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ స్పెషల్ రైలు నడిచే విషయాన్ని చాలా ఆలస్యంగా ప్రకటించడంతో సామాన్య జనాలకు చేరనేలేదు. పేరు జన సాధారణ్.. ఆగింది మాత్రం కొద్ది చోట్ల! జన సాధారణ్ అంటేనే సామాన్యుడి బండి అనే భావన. అలాంటి రైలును సామాన్య ప్రజలకు అత్యంత ఉపయోగపడేలా ఎక్కువ హాల్టులతో నడపాల్సింది పోయి పరిమిత స్టేషన్లకే కట్టిపడేయడం ఎందుకు? పేదల బండి అయితే.. పేదల స్టేషన్లలో ఆపరా? హైదరాబాద్‌కు వెళ్లే పేద ప్రయాణికుడికి ప్రతి రూపాయి విలువైనదే. బస్సు చార్జీలు భరించలేక రైలును ఆశ్రయించే వారికి దగ్గరలోని స్టేషన్‌లో రైలు ఆగకపోతే.. ఆ "జన సాధారణ్" ఎవరి కోసం? ఒక్కరోజు రైలు.. వందరోజుల ప్రచారమా? ఒక్కరోజు నడిచిన రైలుకు రాజకీయ ప్రచారం మాత్రం పెద్ద ఎత్తున జరిగింది. కానీ ఆ రైలు శాశ్వతమవుతుందా? మరిన్ని హాల్టులు వస్తాయా? అనే అసలు ప్రశ్న మాత్రం ఇంకా మిగిలే ఉంది. జన సాధారణ్‌కు జనాలే దూరమైతే.. ప్రయోజనం ఏమిటి? రైల్వే దృష్టిలో ఆపరేషనల్ అవసరాలు ఉండొచ్చు. కానీ ప్రజల అవసరాలు కూడా పరిగణనలోకి రావాలి. ఒక్కరోజు స్పెషల్‌తో మమ అనిపించడం కాదు.. ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వత సర్వీసుగా, అవసరమైన హాల్టులతో నడపడం ముఖ్యం. జన సాధారణ్ పేరు పెట్టడం గొప్ప కాదు... జన సాధారణుడి గమ్యాన్ని చేరేలా రైలు నడపడం గొప్ప! ఇది రాజకీయ క్రెడిట్ కోసం కాదు.. ప్రజల ప్రయాణ హక్కు కోసం అడగాల్సిన ప్రశ్న.

లక్షల వాటర్ ట్యాంక్... నీళ్లు పట్టే నాథుడేడీ?

● నిర్మాణ దశలోనే నిర్లక్ష్యం.. నాణ్యతపై నీలినీడలు! ● ట్యాంక్ నిర్మాణం ఎంత ముఖ్యమో.. క్యూరింగ్ కూడా అంతే ముఖ్యం! ● అధికారుల పర్యవేక్షణలేదు ● గ్రామపంచాయతీ పట్టించుకోదు. ● నేడు నిర్లక్ష్యం.. రేపు ప్రజాధనంతో మరమ్మతులా? ● ప్రజల అవసరాల కోసం నిర్మిస్తున్న ట్యాంక్.. ప్రజలకే ప్రశ్నగా మారిందా?

బ్యూరో్,: ఓదెల గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం లక్షల రూపాయలతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణంలోనే నిర్లక్ష్యం కనిపిస్తోందన్న చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది. నిర్మాణ పనుల్లో కాంక్రీట్‌కు క్యూరింగ్ అత్యంత కీలకం. కానీ నిర్మాణ దశలో ఉన్న ఈ వాటర్ ట్యాంక్‌కు సరైన క్యూరింగ్ జరుగుతోందా? అన్న ప్రశ్నలు తాజాగా వైరల్ అవుతున్న సందేశంతో తెరపైకి వచ్చాయి. క్యూరింగ్ సరిగా లేకపోతే కాంక్రీట్ బలం తగ్గడం, పగుళ్లు రావడం, భవిష్యత్తులో లీకేజీలు ఏర్పడే అవకాశం ఉంటుందని నిర్మాణ నిపుణులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితి వస్తే ప్రజల కోసం ఖర్చు చేసిన నిధులు మళ్లీ మరమ్మతులకే వెళ్లే ప్రమాదం ఉంది. ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా?

ఓదెల మండల కేంద్రంలో క్యూరింగ్ సరిగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్న వాటర్ ట్యాంక్

గ్రామపంచాయతీ సిబ్బంది నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తున్నారా? అన్నది ఇప్పుడు ఓదెలలో చర్చనీయాంశంగా మారింది. వాటర్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు, మెటీరియల్ నాణ్యత, క్యూరింగ్, నిర్మాణ పద్ధతులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి పనులు అంటే కేవలం నిర్మాణం పూర్తి చేయడం కాదు.. నిర్మించినది పదికాలాలు నిలిచేలా చూడటం కూడా అధికారుల బాధ్యతే. లక్షలు ఖర్చు చేసి ట్యాంక్ కట్టడం ఎంత ముఖ్యమో.. దాన్ని నాణ్యతగా కాపాడటం అంతకంటే ముఖ్యం. ఓదెల ప్రజలకు కావాల్సింది ఫొటోలతో కనిపించే అభివృద్ధి కాదు.. నిజంగా ఉపయోగపడే శాశ్వత నిర్మాణం! ప్రజల డిమాండ్ ఒక్కటే
–"వాటర్ ట్యాంక్‌కు నీళ్లు పట్టండి.. నాణ్యతకు ప్రాణం పోయండి!"

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

● ప్రైవేట్‌లో పోతే తగ్గే రోగం, లక్షల జీతాలు తీసుకునే సర్కారు డాక్టర్లకు తగ్గదా ● కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తీవ్ర ఆగ్రహం

గోదావరిఖని ప్రతినిధి : గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యుల అలసత్వం,పర్యవేక్షణ లోపం పరాకాష్టకు చేరాయని రామగుండం నగరపాలక సంస్థ 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం అమానుషమని మండిపడ్డారు. సోమవారం రోజున1వ డివిజన్‌కు చెందిన ఒక సాధారణ యువకుడు విపరీతమైన కాళ్ల నొప్పులతో తట్టుకోలేక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడని తెలిపారు. వార్డులో ఉన్న రోగి తీవ్ర వేదన అనుభవిస్తున్నప్పటికీ అక్కడ డ్యూటీలో ఉన్న వైద్యులు కనీసం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని మండిపడ్డారు. విషయం తెలిసి తాను స్వయంగా ఆసుపత్రికి వెళ్లానని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లతో మాట్లాడి రోగికి తక్షణమే సరైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేసినా వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం తాళలేక, నొప్పుల భారం భరించలేక ఆ యువకుడు చేసేది లేక సాయంత్రం వరకు వైద్యం కోసం ఎదురుచూసి వైద్యులు పట్టించుకోకపోవడంతో విసుగుచెంది గోదావరిఖని లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలివెళ్లాడని తెలిపారు. అక్కడ చేరిన కొద్ది సమయంలోనే ప్రైవేట్ డాక్టర్లు అందించిన చికిత్సతో రోగం నయమై,అతను పూర్తిగా కోలుకుని స్వగృహానికి చేరుకున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మడిపెల్లి విజయ మల్లేష్ ప్రశ్నిస్తు ప్రభుత్వం నుంచి నెలకు లక్షల రూపాయల వేతనాలు పొందుతూ, ప్రభుత్వం నిర్వహించిన కఠినమైన ఇంటర్వ్యూలలో ఎంపికై వచ్చిన డాక్టర్లు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో తగ్గని రోగం ఒక సాధారణ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే వెంటనే ఎలా తగ్గింది అని నిలదీశారు. వైద్యులు సకాలంలో స్పందించక నిర్లక్ష్యం చేయడం వల్లే పేద ప్రజలు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఆరోపించారు. ఉదయం డ్యూటీ కి వచ్చినా డాక్టర్లు 12 గంటలు ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూడడం తప్ప వైద్యం మీద దృష్టి సారించే పరిస్థితి లేదని ఇకనైనా జిల్లా డీఎంహెచ్ఓ స్పందించి హాస్పిటల్ ను తనిఖీ చేసి హాస్పటల్లో నీ సిబ్బందిని గాడిలో పెట్టి పేదలకు వైద్యం అందేల చూడాలని ఒకటోవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ డిమాండ్ చేశారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించి పోలీసుల అనుమతి పొందాలి

రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

గోదావరిఖని క్రైమ్ : రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. శుక్రవారం రామగుండంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం పోలీస్ పోర్టల్ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు, ప్రతిష్ఠించే తేదీ, నిమజ్జనం చేసే తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జన ప్రాంతానికి చేరుకునే వాహనం వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా వెబ్‌సైట్‌లో పొందుపరచాలని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని, వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

గణేష్ ఉత్సవాల్లో డీజేల వినియోగం నిషిద్ధం: గోదావరిఖని సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో డీజే ఆపరేటర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహణ

గోదావరిఖని క్రైమ్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని గోదావరిఖని సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శుక్రవారం గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరిఖని పోలీసుల ఆధ్వర్యంలో గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండప నిర్వాహకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఉత్సవాల్లో సాధారణ సౌండ్ సిస్టమ్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని, మైక్ సిస్టమ్‌ను రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించినట్లయితే, సంబంధిత డీజే ఆపరేటర్లు, యజమానులు, మండప నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం డీజే ఆపరేటర్లు, యజమానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని, అదే సమయంలో పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. డీజేకు దూరంగా ఉండి, బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం, ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి, గణనాథుని ఆశీర్వాదం పొందుదాం అని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డితోపాటు డీజే ఆపరేటర్లు, యజమానులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలి

డిసిపి కార్యాలయం పరిశీలించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

మహేశ్వరం సెప్టెంబర్ 11, : ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని ఫ్యూచర్ సిటీ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి పేర్కొన్నారు. తుక్కుగూడలోని డిసిపి కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ పరిపాలన పెండింగ్ కేసులు పై కొనసాగుతున్న దర్యాప్తులను పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ తరుణ్ జోష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను దర్యాప్తులను వేగవంతం చేసి కేసులు నిర్ణీత సమయంలో పూర్తిచేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలన్నారు. ఫిర్యాదులు పిటిషన్ల పై విధివిధానాలకు అనుగుణంగా సత్వర చర్యలు తీసుకొని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. అధికారులు సిబ్బంది క్రమశిక్షణ పాటిస్తూ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి సమర్థవంతమైన పారదర్శకమైన సేవలను ప్రజలకు పోలీసులు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డిసిపి కె నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు గ్రామంలో వైద్య ప్రారంభించిన సర్పంచ్ సునీల్

మధిర ప్రతినిధి : సెప్టెంబర్ 11 : మధిర మండలం చిలుకూరు గ్రామంలో శుక్రవారం నాడు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ కుక్కమాళ్ళ సునీల్ కుమార్ గారు వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో నవ శకం ఫౌండర్ మేకల రమేష్, చిలుకూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, సత్యనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్, సవరం వెంకటేశ్వర్లు, గ్రామ ఉప సర్పంచ్ వంశి గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాసంతో ఆరోగ్యకర సమాజానికి బాటలు

మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి

ధర్మపురి, సెప్టెంబర్ 11,: పోషణ మాసంతో ఆరోగ్యకర సమాజానికి బాటలు వేస్తున్నామని ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ధర్మపురి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ అభియాన్ పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం ధర్మపురి పట్టణంలోని 5వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ముఖ్యంగా 3సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అంగన్‌వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, ప్రాథమిక విద్యతో పాటు తల్లులకు పోషకాహారం మరియు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్ తరాలను తీర్చిదిద్దవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ డాక్టర్ స్వప్న, అంగన్వాడి ఉపాధ్యాయురాలు మాధవిలత, ఉపాద్యాయుడు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయపట్నం గ్రామాలో పొలం బాట కార్యక్రమం చేపట్టిన సర్పంచ్ గోపి

మధిర ప్రతినిధి : మధిర మండల పరిధిలోని రాయపట్నం గ్రామంలో శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్ కంచం గోపి ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏఈ ఎస్ అనిల్ కుమార్ పాల్గొని రైతులుకి అవగాహన కల్పించారు. రైతుల యొక్క మోటార్లకు కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలని , కెపాసిటర్లను ఏర్పరచు కోవడం వల్ల వోల్టేజ్ హెచ్చుతగ్గుల నుండి రైతుల యొక్క మోటార్ను రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలోని లైన్ ఇన్స్పెక్టర్ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, లైన్మెన్ రాజు, కోట రాజా రైతులు పాల్గొన్నారు.

రైతుల కష్ట తెలిసిన నాయకుడు

ఇది నాయకత్వం అంటే... నాయకుడే కాదు ఆదర్శ రైతు కూడా!

మధిర రైతుల కోసం సాగర్ కలలోకి దిగిన సీనియర్ కాంగ్రెస్ నేత కిషోర్

మధిర ప్రతినిధి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో గోదావరి జలాలను మధిర నియోజకవర్గ రైతాంగానికి అందించే కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది. ఆ నాయకుడి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ స్వయంగా రంగంలోకి దిగారు. మధిర ప్రాంత రైతుల పొలాలకు సాగునీరు అందేలా, నాగార్జున సాగర్ కాలువలోకి స్వయంగా దిగి, తూములను దగ్గరుండి పరిశీలిస్తున్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏసీ రూముల్లో కూర్చోకుండా బురదలో దిగి రైతుల కోసం పనిచేస్తున్న కిషోర్ నిజమైన ప్రజా నాయకుడని, ఆదర్శ రైతు అని మధిర రైతులు ప్రశంసిస్తున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

● నో మ్యాపింగ్ అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలి ● అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

ధర్మపురి, సెప్టెంబర్ 11, : ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పూర్తి స్థాయిలో, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల నుంచి సేకరించిన ఆధారాలు, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యం అని ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని జిల్లా

కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం 2027 లో రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ధర్మపురి లోని గోదావరి నది వద్ద జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతంగా, ప్రణాళికలకు అనుగుణంగా భక్తులకు, విఐపి లకు అసౌకర్యం కలుగకుండా పుష్కర ఘాట్లను నిర్మించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శాఖ అధికారులు బిఎల్ వో లు మరియు తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవం నిర్వహణపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

● కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేస్తుంది ● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్11: తెలంగాణ ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు సాగిన చారిత్రక పోరాటం, తెలంగాణకు అసలైన స్వాతంత్రం లభించిన సెప్టెంబర్ 17 ను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించే పరిస్థితుల్లో లేదని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన కాంగ్రెస్ సర్కార్ , ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేయడం మానుకొని, అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాన కొండూరు మండల కేంద్రంలో జరిగిన నియోజకవర్గస్థాయి మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. భారతదేశ సమైక్యత కోసం ఉక్కు సంకల్పంతో కృషి చేసిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన చర్యల ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తు చేశారు. తెలంగాణ విముక్తి కోసం రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వేలాది మంది వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు తదితరుల నాయకత్వంలో పోరాడిన కార్యకర్తలు, గ్రామీణ ప్రాంతాల్లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సామాన్య ప్రజలు తెలంగాణ విమోచన చరిత్రలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం' కాకుండా అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను

మరుగునపరిచే ప్రయత్నాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, మానకొండూరు మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, సెన్సార్ ఫిలిం బోర్డ్ మెంబర్ రాపాక ప్రవీణ్, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, బొగ్గుల రమేష్, బూట్ల శ్రీనివాస్, దూలం కిరణ్ గౌడ్, మియాపురం లక్ష్మణచారి, కత్తి ప్రభాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి భాషబోయిన ప్రదీప్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య, తిమ్మాపూర్ బీజేవైఎం మండల అధ్యక్షులు అరుణ్, బీజేవైఎం నాయకులు మర్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

● మార్చి 2027 నాటికి ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేయాలి ● పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి : ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ, పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధనకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు లిలిమార్చి 2027 నాటికి పూర్తిచేయాలనిలిలి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను ఏర్పాటు చేసి, విద్యుత్, నీరు, ఇతర అనుబంధ సౌకర్యాల పనులను సైతం పూర్తిచేయాలని సూచించారు.ఆసుపత్రి భవనం ప్రారంభించే నాటికే అన్ని విభాగాలు, పరికరాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని, ప్రారంభం నుంచే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జూనియర్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలి: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, చేపట్టిన పునరుద్ధరణ పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా పనులను వేగవంతం చేయాలని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థికి విద్యతో పాటు నైపుణ్యాలు : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వారి విద్యా స్థాయిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యాపరమైన పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలోగా సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు అదనపు బోధన, అవసరమైన సహాయాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు

వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని తెలిపారు.పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ పర్యటనలో టీజీఎంఐడీసీ విశ్వప్రసాద్, సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై ప్రజలు ఆందోళన చెందవద్దు: వరహాల చారి

మానకొండూర్, సెప్టెంబర్ 11: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ బండారిపెల్లి శ్రీనివాస్ శుక్రవారం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు.సహకార సంఘ వైస్ చైర్మన్ వరహాల చారి హాజరై మాట్లాడుతూ..... గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కున్నారని, ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఇప్పటికే అనేక పథకాలను అమలు చేసిన ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు,ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, స్మార్ట్ కార్డున్న లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందేలా పోర్టబిలిటీ విదానం కూడా అందుబాటులో ఉందని, ప్రతిపక్షాల మాటలతో హామీల అమలుపై ప్రజలు ఆందోళన చెందవద్దని వరహాల చారి ధీమా వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యదర్శి సుష్మా రెడ్డి, జీపిఓ శారద, ఉప సర్పంచ్ దాడి కార్తిక్, పలువురు వార్డు సభ్యులు, కెడిసిసి మాజీ డైరెక్టర్ జీడీ శ్యాం సుందర్, నాయకులు రేణుకుంట పర్శరాములు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా వినాయక చవితి ముందస్తు వేడుకలు

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలి: విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, సెప్టెంబర్ 10: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనివ్వాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని, శుక్రవారం సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని, పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రతి పండుగ యొక్క విశిష్టతను తెలియజేస్తూ పాఠశాలలో ఇలాంటి వేడుకలను ప్రత్యక్షంగా నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో అవగాహనతో పాటు ఆధ్యాత్మిక భావం పెంపొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం చదువులోనే కాకుండా, ప్రతి అంశంలోనూ విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు, పండుగ విశిష్టతను చాటిచెప్పే ప్రసంగాలు మరియు నృత్యాలు అందరినీ ఆకట్టుకుని ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఘనంగా 70వ జోనల్ క్రీడల ప్రారంభం

సుల్తానాబాద్, సెప్టెంబర్ 11: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ మీట్ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి, నాలుగు మండలాల నుండి తరలివచ్చిన పాఠశాల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడా జెండాను ఆవిష్కరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి క్రీడా పోటీలు ఒక అద్భుతమైన వేదిక అని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా డీవైఎస్ఓ సురేష్ , స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, వరప్రదీప్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు కుమార్ కిషోర్, అమిరిశెట్టి తిరుపతి, భైరగోని రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ దాసరి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, సత్యం, సంపత్, రవీందర్, డాక్టర్ సింధుజ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ జోనల్ మీట్‌లో నాలుగు మండలాల నుండి వచ్చిన పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడాంశాలలో ఉత్సాహంగా పోటీ పడుతున్నారు.

ఎమ్మెల్యేని ప్రశ్నించినందుకు సర్పంచ్‌పై దాడి దుర్మార్గం: మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్, సెప్టెంబర్11: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో గురువారం జరిగిన ఘర్షణ ఘటనలో గాయపడిన సర్పంచ్ తాట్ల తిరుపతిని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు శుక్రవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం రసమయి, జివిఆర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే కవ్వంపల్లిని ప్రశ్నించినందుకే సర్పంచ్‌పై దాడికి పాల్పడటం దుర్మార్గమని ఇది కాంగ్రెస్ గుండాల అరాచకానికి నిదర్శనమని ఆరోపిస్తూ అసలు సర్పంచ్‌పై దాడి చేయడం వెనుకున్న ఉద్దేశ్యం ఏంటని ప్రశ్నించారు.దాడి వెనుక ఎమ్మెల్యే కుట్ర ఉందన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతుండగా ఇది ముమ్మాటికీ ఎమ్మెల్యే కుట్రతో జరిగిన దాడిగానే భావిస్తున్నామంటూ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కుట్రకు పాల్పడిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, జరిగిన దాడిపై ఎమ్మెల్యే కవ్వంపల్లి వెంటనే స్పందించాలని, నిర్లక్ష్యం వహిస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని రసమయి హెచ్చరించారు.

కోతులతో పరేషాన్.. ఇళ్లలోకి చొరబడుతూ ఇబ్బందులు

- భయాందోళనలో గ్రామ ప్రజలు - కల్వచర్ల తొమ్మిది, పది వార్డులలోని మహిళలు సర్పంచ్ కు వినతిపత్రం

రామగిరి, సెప్టెంబర్ 11:- రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని తొమ్మిది, పది వార్డులలో గత కొన్ని నెలలుగా కోతుల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ రేండ్ల శారద– కుమారస్వామికి తొమ్మిది, పది వార్డులకు చెందిన మహిళలు వినతిపత్రం అందజేశారు. దీంతో చిన్నపిల్లలు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని, పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే స్పందించి సంబంధిత అటవీ శాఖ అధికారులతో మాట్లాడి కోతులను పట్టించి అటవీ ప్రాంతానికి తరలించాలని, తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. లేని పక్షంలో వార్డు ప్రజలందరితో కలిసి నిరసనకు దిగుతామని హెచ్చరించారు.కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంత మంది టపాసులు, పెద్ద శబ్దాలు చేసి కోతులను తరిమే ప్రయత్నం చేస్తున్నారు. కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టి వాటిని అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో తొమ్మిది,పది వార్డు సభ్యులు రేండ్ల కుమారస్వామి, చిందం కవితలతో పాటు మహిళలు కె. రమాదేవి, సిహెచ్. రమాదేవి, సిహెచ్. శిరీష, ఎన్. రాజేశ్వరి, డి. సాత్విక, బి. సమత, సిహెచ్. రాణి తదితరులు పద్దెంది మంది పాల్గొని సంతకాలు చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలి కోతులు ఇళ్లలోకి గుంపుగుంపులుగా వచ్చి ఆహారపదార్థాలు ఎత్తుకెళ్తు న్నాయి. వాటిని తరిమేక్రమంలో దాడులు చేస్తున్నాయి. కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదానికి గురైన గని కార్మికులను పరామర్శించిన నాతరి స్వామి

బెల్లంపల్లి 11 సెప్టెంబర్ : బెల్లంపల్లి కాసిపేట మైనులో గత నాలుగు రోజుల క్రితం బొగ్గుగనిలో బాంబు మిస్ బ్లాస్ట్ కావడంతో బెల్లంపల్లి నివాసులకు గాయాలు కావడంతో సింగరేణి యాజమాన్యం బిజోన్ సింగరేణి ఆసుపత్రిలో అడ్మిట్ చేసి చికిత్స నిర్వహిస్తున్నారు కార్మికులు క్రాంతి కుమార్, రాజ్ కుమార్ లను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు టి పి సి సి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, వారితోపాటు యూత్ నాయకులు మారపాక వంశీ గారు, ఎం ఆర్ పి ఎస్ నాయకులు మచ్చ రాజేష్, మచ్చ మణిరాజు, రాజలింగు, తదితరు పాల్గొన్నరు.

కమ్యూనిస్టుల పోరాటంతోనే నిజాం పాలన అంతం

● పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం
● సాయుధ పోరాట వారోత్సవాల్లో సిపిఐ నేత బాగం

ఖమ్మం ప్రతి నిధి, సెప్టెంబర్ 11: కమ్యూనిస్టుల పోరాటాలతోనే నిజాం రక్కసి పాలన అంతమైందని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేకుంటే భారతదేశపు నడిబొడ్డున ఇప్పటికీ నిజాం రాజ్యం కొనసాగుతూనే ఉండేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే సువర్ణక్షరాలతో లిఖించదగిన ఈ మహాత్తర పోరాటంలో నాలుగువేల మంది –అమరులయ్యారని అనేక గ్రామాలు విముక్తి చేయబడ్డాయని, దొరలు, జమీందార్ల పాలన అంతమైందని ఆయన తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను శుక్రవారం ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహం వద్ద ప్రారంభించారు. పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పూలమాల వేయగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ సాయుధ పోరాటం ఒక చారిత్రిక ఘట్టమన్నారు. తెలంగాణలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలన నిర్బంధాలు, వేధింపులు మధ్య సాగేదని ఎవరికి స్వేచ్ఛ లేదని నిజాం సైన్యాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు ప్రజల చేత వెట్టి చాకిరి చేయించుకునే వారని భూమి మొత్తం వారి చేతుల్లోనే కేంద్రీకృతమైందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 11 సెప్టెంబర్ 1947న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం –మోహినుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. సాయుధ పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారని మూడువేల గ్రామాలు భూస్వాముల చెర నుండి విముక్తి చేయబడ్డాయన్నారు. సాయుధ పోరాటం ద్వారా తెలంగాణలో భూమి పేదల పరంమైందని హేమంతరావు తెలిపారు. సాయుధ పోరాటం కేవలం నిజాం అంతానికి కాకుండా తెలంగాణలో ఒక –నూతన సంస్కృతి, సాంప్రదాయానికి తెర లేపిందని ప్రజలు స్వేచ్ఛావాయువులను పీల్చారన్నారు. భూమి, భుక్తి, విముక్తి నినాదంగా సాగిన ఈ సాయుధ పోరాటంలో అనేక మంది అమరులయ్యారని వారి త్యాగాలు అజరామరమన్నారు. ఇప్పుడు దేశంలో అప్రకటిత నిర్బంధం కొనసాగుతుందని ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని హేమంతరావు ఆరోపించారు. పేరుకు ప్రజాస్వామ్యం అమలులో ఉన్న నిర్ణయాలు అప్రజాస్వామికంగా ఉంటున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ తప్పిదాలపై ప్రశ్నిస్తే దిమాగి నక్సల్స్ గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఒక పక్క మతతత్వం పెరుగుతుండగా మరో పక్క ఆర్థిక అంతరాలు పెరిగి ఈ దేశంలో సంపద పోగుపడుతుందన్నారు. సమాజ రక్షణకు బడుగు, బలహీన వర్గాలకు అండగా పోరాటాలు సాగించేందుకు సాయుధ పోరాట చరిత్ర దోహదపడాలన్నారు. అనాటి అమరుల "త్యాగాలను స్మరించుకుని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. పాలకుల ప్రజా వ్యతిరేక –విధానాలపై సమరశీల పోరాటాలకు సాయుధ పోరాట వారోత్సవాలు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర –సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహలక్ష్మి, తోట రామాంజనేయులు, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారంపర్య వైద్యానికి ప్రభుత్వ గుర్తింపునివ్వాలి: పూర్వ వైభవం తీసుక రావాలి

● పారం పర్య వైద్య మహా సంఘం అభ్యర్థన ● సదస్సు వివరాలు వెల్లడించిన సంఘం గౌరవ సలహాదారులు రామడుగు వీరభద్రాచారి

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11: పారం పర్య వైద్యానికి ప్రభుత్వం గుర్తింపు నివ్వాలని పారంపర్య వైద్య మహా సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 8,9,10 తేదీల్లో భద్రాచలంలో అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి ల నిత్య అన్నదాన సత్రంలో పారం పర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ మేరకు సదస్సు వివరాలను సంఘం గౌరవ సలహాదారులు రామడుగు వీరభద్రాచారి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు . ఈ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, బీహార్, కేరళ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి పారం పర్య వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సులో భారతీయ సనాతన ఆయుర్వేద సిద్ధ వైద్యం, వైద్య విధానాలు , వైద్య గ్రంథాలు , దేశమంతటా వేల సంవత్సరాల నుండి విస్తరించి ఉన్న మన దేశ వారసత్వ సంపదకు మనమంతా వారసులమేనన్నారు. మన వైద్యాన్ని మనం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. మన పారం పర్య వైద్యానికి ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు ను సాధించేందుకు ఈ పారం పర్య మహా సంఘం ముందుకు సాగుతున్నట్లు పలువురు వక్తలు ఉద్ఘాటించినట్లు తెలిపారు . ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సంఘం గౌరవ సలహాదారు రామడుగు వీరభద్రాచారి స్వయంగా తయారు చేసిన జీవ గడియారం (బయో క్లాక్)ను శివక్షేత్ర పీఠాధిపతులు శివ స్వామీజీ చేతుల మీదుగా ఆయురారోగ్య ప్రదాత అయిన శ్రీ ధన్వంతరీ భగవానుడి కాంస్య విగ్రహాన్ని బహుకరిస్తూ అభినందించి ఆశీర్వదించినట్లు తెలిపారు. తెలంగాణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొంత యాత్రీ మహర్షి , ఏపీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్ శ్రీనివాసులు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ పుత్తూరు సెల్య వైద్యులు చంద్రశేఖర రాజు, వైద్య రత్న, అడవిదేవుడు జమాల్ ఖాన్, యోగి శ్రీ సిద్ధ రామయ్య, మెడిటస్ ప్రొఫెసర్ టీడీయూ బెంగుళూరు హరిరామ మూర్తి, గౌరవ అధ్యక్షులు సర్జన రమేష్, గౌరవ సలహాదారులు దాడే వెంకట్రావ్ , ఉపాధ్యక్షులు కామంచి శ్రీనివాస్, భాను ప్రసాద్, కోశాధికారి దుర్గా. రాణి, ఉప కోశాధికారి అరుణాజ్ సహాయ కార్యదర్శులు రాజయ్య, రామకృష్ణయ్య, వెంకటేశ్వర రెడ్డి, వహీద్ అలీ, పద్మారావు, మోహన్ , రవీందర్, ఆనందం, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొని అభినందించారు. ఈ జీవ గడియారం ప్రాముఖ్యత : శరీరంలోని త్రి దోషాలైనా వాత, పిత్త, కఫం సమతుల్యతపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఈ ముదు దోషాలు ఏ మాత్రం అసమ తుల్యతకు గురైనా రోగాల బారిన పడతామన్నారు. ఈ జీవ గడియారం ఏ సమయంలో ఏ పని చేయాలనేటువంటి దినచర్యను, ఆయా సమయాలలో వాత , పిత్త, కఫాల దోషాలను తెలుపుతుందన్నారు. ఈ జీవ గడియారం నిరంతరం దినచర్య తో పాటు మనకు క్రమశిక్షణ నేర్పుతుందనీ వివరించారు.

పోచమ్మ నూతన దేవాలయ నిర్మాణానికి గ్రానైట్, టైల్స్ బహూకరణ

పాశం కొమురయ్య, గోవిందుల స్వాములు

రామగిరి, సెప్టెంబర్ 11: రామగిరి మండలం బేగంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయానికి పాశం కొమురయ్య, గోవిందుల స్వామి కలిసి సుమారు రూ.లక్ష విలువైన గ్రానైట్, టైల్స్‌ను బహూకరించారు. ఆలయ నిర్మాణ పనులకు అవసరమైన గ్రానైట్, టైల్స్‌ను ఆలయ కమిటీ సభ్యులకువారుస్వయంగాఅందజేశారు.గ్రామప్రజలఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఎంతో సంతోషంగా ఉందని పాశం కొమురయ్య, గోవిందుల స్వామి తెలిపారు. దేవాలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని వారు ఆకాంక్షించారు. గ్రామంలో దేవాలయ నిర్మాణం పూర్తయితే భక్తులకు పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. పోచమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు, దాతలు, భక్తులు తమకు తోచిన విధంగా సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. దేవాలయ నిర్మాణానికి అవసరమైన సామగ్రిని అందజేసిన పాశం కొమురయ్య, గోవిందుల స్వాములకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం ఇతర దాతలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాశం కొమురయ్య, గోవిందుల స్వామి పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానేరు నుండి కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి

ఇల్లంతకుంట, సెప్టెంబర్11: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి, తాళ్ళపల్లి, జవారిపేట గ్రామాల రైతులు గాలిపెల్లి కెనాల్ బ్రిడ్జిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.... మండల పరిధిలోని మధ్య మానేరు జలాశయం నుండి నెలకు 2,3 సార్లు నీటిని వదిలోతే భూగర్భ జలాలు పెరిగే అవకాశం వుంటుందని, వర్షాకాలంలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున మానేరు నుండి కుడి కాలువ ద్వారా పంటలకు నీటిని వదలాలని,లేనియెడల రైతులందరం కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు చేపడుతామని సర్పంచ్ హెచ్చరించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఉపేంద్ర చారి, ఇరిగేషన్ డి ఇ. వేగ్గలం సూర్య ప్రకాష్ అక్కడికి చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

నాగేపల్లి స్మశానవాటిక వద్ద ఐమ్యాక్స్ లైట్ ప్రారంభం

- లైట్‌ను ప్రారంభించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ - రాత్రి వేళల్లో అంత్యక్రియల ఇబ్బందులకు చెక్ - సర్పంచ్ దివ్య సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు

రామగిరి, సెప్టెంబర్ 11:- రామగిరి మండలం నాగేపల్లి గ్రామ స్మశానవాటిక వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐమ్యాక్స్ లైట్‌ను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాగేపల్లి గ్రామ సర్పంచ్ కొండవీన దివ్య సుధాకర్ ఆధ్వర్యంలో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.స్మశానవాటిక వద్ద సరైన వెలుతురు లేక రాత్రి వేళల్లో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ ఐమ్యాక్స్ లైట్‌ను ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ సదుపాయంతో ఇకపై చీకటి కష్టాలు తీరనున్నాయని, ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్యా గౌడ్, నాగేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, మాజీ ఉప సర్పంచ్ వేముల కనుకయ్య, వార్డు సభ్యులు గోపాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరేపల్లి శ్రీను, కొండవీన ప్రభాకర్, పోలు హరీష్, బంకు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగేపల్లి చెరువు కట్ట చుట్టూ పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కల ప్రక్షాళన

- బతుకమ్మ సంబురాలు, మత్స్యకారుల ఉపాధికి పెద్దపీట - సర్పంచ్ దివ్య సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు - పనులను పరిశీలించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్

రామగిరి, సెప్టెంబర్ :- రామగిరి మండలం నాగేపల్లిలో రాబోయే దసరా, బతుకమ్మ పండుగల కోసం గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ చెరువు ప్రక్షాళన పనులను ఏర్పాటు చేయగా, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ స్వయంగా విచ్చేసి పనులను పరిశీలించారు. చెరువు కట్ట చుట్టూ పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కల వల్ల మహిళలకు, వలలు వేసుకునే మత్స్యకారులకు ఇబ్బందులు కలగకుండా ఈ ముందస్తు చర్యలు చేపట్టారు.ఈ సమస్యపై సర్పంచ్ దివ్య సుధాకర్ వెంటనే స్పందించి సిబ్బందితో ఆటంకాలను తొలగించే పనులను పకడ్బందీగా ఏర్పాటు చేయగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ దగ్గరుండి పనుల తీరును క్షుణ్ణంగా పరిశీలించి, పనులు సక్రమంగా జరిగేలా తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,నాగేపెల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య,మాజీ ఉప సర్పంచ్ వేముల కనుకయ్య,వార్డు సభ్యులు గోపాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరేపల్లి శ్రీను, కొండవేనా ప్రభాకర్ పోలు హరీష్,బంకు మల్లేష్, పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి...

- ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి నిందితులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: ఆల్ సంఘాల ఐక్యవేదిక పెద్దపల్లి డిమాండ్

పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, కులం పేరుతో దూషణలు, బెదిరింపులను అరికట్టాలని ఆల్ సంఘాల ఐక్యవేదిక పెద్దపల్లి డిమాండ్ చేసింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పెద్దకల్వల గ్రామం పెద్దబొంకూరు శివారు ప్రాంతంలో భూమి కొనుగోలు విషయమై జరిగిన చర్చల్లో వివాదం తలెత్తిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఉదయ్‌నగర్‌కు చెందిన కుక్క కనకరాజు, ఇందిరానగర్‌కు చెందిన బొంకురి నరేందర్ పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 12న మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో భూమి కొనుగోలు విషయమై నేతేట్ల వెంకటేష్ వద్దకు కుక్క కనకరాజు, బొంకురి నరేందర్ వెళ్లారు. అక్కడ ఉన్న చెలకల శ్రీనివాస్, ఐలయ్య, మనోజ్ తమతో గొడవకు దిగారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారని నాయకులు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదులో తీవ్ర జాప్యం జరుగుతోందని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. కులం పేరుతో దూషణలు జరిగిన ఘటనల్లో ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ, కిందిస్థాయి పోలీసులు కేసులు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 నుంచి 30 ఎస్సీ, ఎస్టీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, పలువురు బాధితులకు ఇప్పటికీ ఎఫ్ఐఆర్ కాపీలు అందలేదని ఆరోపించారు. పెండింగ్ కేసులపై తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు వెంటనే ఎఫ్ఐఆర్ కాపీలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమపై తిరుగు కేసులు పెడతామని పోలీసులు బెదిరిస్తున్నారని సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న పోలీసులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉండగా, ఉద్యమకారులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సంబంధిత సీఐపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితుల ఫిర్యాదుల మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలపై తక్షణ స్పందన లేకపోతే డీసీపీ, సీపీ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని, అన్ని సంఘాలతో చర్చించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం శాంతియుతంగా ధర్నాలు నిర్వహిస్తున్నామని, బాధితులకు న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, కుక్క అశోక్, బొంకురి నరేందర్, మామిడిపల్లి బాపయ్య, నంబయ్య, సతీష్, రామిళ్ల శారద, కల్లేపల్లి అశోక్, మోదుంపల్లి శ్రావణ్, నూనె వెంకటేష్ తదితరులతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఐ రమేష్‌కి ఫౌండేషన్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలికిన సురేష్

సేవా కార్యక్రమాలతో ముందుకు హర్ష కేతన్ ఫౌండేషన్ లక్ష్యం

మధిర ప్రతినిధి : సెప్టెంబర్ 11: మధిర పట్టణంలో హర్ష కేతన్ ఫౌండేషన్ నూతనంగా ప్రారంభం కానుంది. ఈ నెల 16వ తారీకున జరిగే ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మధిర టౌన్ సీఐ రమేష్‌కి శుక్రవారం నాడు ఫౌండేషన్ నిర్వాహకులు కూరపాటి సురేష్ చమార్ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కూరపాటి సురేష్ చమార్ మాట్లాడుతూ. సమాజ సేవే లక్ష్యంగా, పేదలకు, నిరుపేద విద్యార్థులకు, అవసరంలో ఉన్నవారికి అండగా ఉండాలనే సంకల్పంతో హర్ష కేతన్ ఫౌండేషన్ ను ప్రారంభిస్తున్నామన్నారు. సీఐ రమేష్ తమ ఆహ్వానాన్ని మన్నించి ప్రారంభోత్సవానికి రావడానికి అంగీకరించారని తెలిపారు, పట్టణంలో హర్ష కేతన్ ఫౌండేషన్ నూతనంగా ప్రారంభం కానుంది. ఈ నెల 16వ తారీకున జరిగే ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మధిర టౌన్ సీఐ రమేష్‌కి ఫౌండేషన్ నిర్వాహకులు కూరపాటి సురేష్ చమార్ శుక్రవారం నాడు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కూరపాటి సురేష్ చమార్ మాట్లాడుతూ. సమాజ సేవే లక్ష్యంగా, పేదలకు, నిరుపేద విద్యార్థులకు, అవసరంలో ఉన్నవారికి అండగా ఉండాలనే సంకల్పంతో హర్షకేతన్ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తు న్నామన్నారు. సీఐ రమేష్ తమ ఆహ్వానాన్ని మన్నించి ప్రారంభోత్సవానికి రావడానికి అంగీకరించారని తెలిపారు.

డివిజన్ 241లో బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై ఆసక్తి

- బీఆర్ఎస్ టికెట్ రేసులో కాసాని శ్రీధర్ ముందంజ - మక్తా--

మహబూబ్‌పట్నంలో శ్రీధర్‌కు బలమైన పట్టు

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో డివిజన్ 241లో బీఆర్ఎస్ పార్టీ తరఫున కార్పొరేటర్ టికెట్ ఆశిస్తున్న వారిలో కాసాని శ్రీధర్ ముదిరాజ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధాలు, యువతతో మంచి అనుబంధం, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించేతత్వం ఆయనకు రాజకీయంగా అదనపు బలంగా మారుతున్నాయని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మక్తా--మహబూబ్‌పట్నం ప్రాంతంలో ప్రజలతో ఆయనకు ఉన్న పరిచయాలు, సామాజిక కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం ఆయన అభ్యర్థిత్వానికి అనుకూలంగా మారుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. కాసాని శ్రీధర్ ముదిరాజ్ కుటుంబానికి కూడా రాజకీయంగా మంచి నేపథ్యం ఉంది. ఆయన తండ్రి కాసాని రామాంజనేయులు గతంలో మాజీ ఉపసర్పంచ్‌గా పనిచేస్తూ ప్రజలకు సేవలందించారు. అదేవిధంగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేవెళ్ల ఎంపీగా రాజకీయంగా కీలక పాత్ర పోషిస్తున్నారు. కుటుంబానికి ఉన్న రాజకీయ అనుభవం, ప్రజలతో ఏర్పడిన అనుబంధం శ్రీధర్‌కు మరింత కలిసొచ్చే అంశాలుగా స్థానిక రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డివిజన్ 241లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధికి కాసాని శ్రీధర్ ముదిరాజ్‌కు పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. పార్టీ టికెట్ లభిస్తే ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని వారు పేర్కొంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డివిజన్ 241లో బీఆర్ఎస్ కార్పొరేటర్ టికెట్ కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో కాసాని శ్రీధర్ ముదిరాజ్ పేరు ముందువరుసలో వినిపిస్తుండటం స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే రోజుల్లో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం డివిజన్‌లో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల విస్తరణ

● కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణతో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11: ప్రభుత్వ ఆసుపత్రి అంటే సాధారణ వైద్యం మాత్రమే అనే భావనను మార్చేలా ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఆధునిక వైద్య పరీక్షలు, అధునాతన స్కానింగ్ సదుపాయాలు, రేడియాలజీ సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర రోగులకు పడక వద్దే పరీక్షలు వంటి అనేక సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతోంది. ఖరీదైన పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే అనేక ఆధునిక సేవలు అందుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రిలోని అవసరాలను గుర్తించడం, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకు రావడం, వాటికి అవసరమైన మౌళిక వసతులు కల్పించడం, వైద్య నిపుణుల కొరతను అధిగమించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు రాష్ట్ర మంత్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల బలోపేతానికి మరింత ఊతం లభిస్తోంది. మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి: ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి కొత్తగా 3 పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అవసరమైన రోగులకు వేగంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని బట్టి పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోర్టబుల్ యంత్రాలు ఎంతోఉపయోగపడుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రదేశంలోనే పరీక్ష నిర్వహించే వెసులుబాటు ఏర్పడుతోంది. త్వరలో ఎంఆర్ఐ.. కలెక్టర్ చొరవతో సివిల్ పనులు వేగవంతం: ఖమ్మం సర్వజనాసుపత్రిలో త్వరలో ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తి చేస్తున్నారు. ఎంఆర్ఐ యంత్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యంత్రం ఏర్పాటు చేసిన తర్వాత అది నిరంతరాయంగా ప్రజలకు సేవలందించేలా అవసరమైన మౌళిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు. మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలు, తదితర ప్రాంతాలకు సంబంధించిన అనేక సమస్యలను గుర్తించడంలో ఎంఆర్ఐ పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అధిక వ్యయంతో కూడిన ప్రైవేటు పరీక్షల భారం తగ్గనుంది. పడక వద్దే ఎక్స్‌రే.. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఉపశమనం: సర్వజనాసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్‌రే, స్థిర ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు అవసరాన్ని బట్టి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉండటం వల్ల కదలలేని రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గింది. రోగిని పడకపైనే ఉంచి అవసరమైన సమయంలో అక్కడికక్కడే ఎక్స్‌రే తీసే సదుపాయం ఏర్పడింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర చికిత్స పొందుతున్నవారు, కదలడానికి ఇబ్బంది ఉన్న రోగులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. రోగిని తరలించే సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంతో పాటు వైద్యులకు త్వరగా పరీక్షా ఫలితాలు అందే అవకాశం ఏర్పడింది. అదనంగా ఓపీ, ఐపీ సేవలకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు. టీ-హబ్‌లో అదనపు ఎక్స్‌రే యంత్రంతో పాటు మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.జనవరి--ఆగస్టులో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు: ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అల్ట్రాసౌండ్ సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర తదితర విభాగాలకు వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 స్కాన్లు నిర్వహించడం ద్వారా సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్న విషయం స్పష్టమవుతోంది. మాతా శిశు సంరక్షణలో 16,961 స్కాన్లు: గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 16,961 స్కాన్లు నిర్వహించారు. వీటిలో 8,945 ఓబీజీ స్కాన్లు , 5,417 ఉదర భాగం స్కాన్లు , 546 టిఫ్ఫా స్కాన్లు, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి. నెలవారీగా పరిశీలిస్తే ఓబీజీ స్కాన్లు జనవరిలో 910 నుంచి ఆగస్టులో 1,329కు పెరిగాయి. ఉదర భాగం స్కాన్లు జనవరిలో 455 ఉండగా జూలైలో 999కు చేరాయి. చిన్నారులకు నిర్వహించిన స్కాన్లు ఆగస్టులో 388కు చేరాయి.ఇది మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరీక్షా సేవల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోంది. గర్భంలోని శిశు వు ఆరోగ్యం ముందుగానే తెలుసుకునే అవకాశం: మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా టిఫ్ఫా స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భధారణలో సాధారణంగా ఐదు నుంచి ఆరో నెల మధ్య నిర్వహించే ఈ పరీక్ష ద్వారా గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంటుంది. పిండంలో అవయవ లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ముందుగానే వైద్య ప్రణాళిక రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రైవేటు వైద్య కేంద్రాల్లో సాధారణంగా సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా సేవను ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉచితంగా అందించడం గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరం. టిఫ్ఫా స్కాన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఫిబ్రవరిలో 19 గా ఉన్న స్కాన్లు , ఆగస్టులో 136కు చేరాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 546 టిఫ్ఫా స్కాన్లు నిర్వహించారు. కలర్ డాప్లర్‌తో రక్తనాళాల సమస్యలకు ముందస్తు గుర్తింపు: సర్వజనాసుపత్రిలో కలర్ డాప్లర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రక్త నాళాల్లో రక్తప్రసరణను పరిశీలించడం, రక్త నాళాల్లో ఏర్పడే అడ్డంకులను గుర్తించడం వంటి వాటికి ఈ పరీక్ష ఉపయోగపడు తుంది. రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు లేదా ఇతర కారణాలతో ఏర్పడే అడ్డంకులను గుర్తించేందుకు కలర్ డాప్లర్ సహాయపడు తుంది. డీప్ వీన్ థ్రాంబోసిస్, సిరలకు సంబంధించిన సమస్యలు, ధమనుల్లో రక్తం గడ్డకట్టడం వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. సకాలంలో వ్యాధిని గుర్తించి అవసరమైన వైద్య చికిత్స లేదా శస్త్రచికిత్స అందించడం ద్వారా చేతులు, కాళ్లకు కలిగే నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది. ప్రైవేటు వైద్య కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు సుమారు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ఖర్చయ్యే సేవను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోంది. కాంట్రాస్ట్ సీటీ.. హెచ్ఆర్ సీటీ సేవలు: సర్వజనాసుపత్రిలో కాంట్రాస్ట్ సీటీ స్కాన్ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారు. పగలు, రాత్రి మూడు షిఫ్టుల్లో సేవలు కొనసాగిస్తూ అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కణతులు, వివిధ అవయవాల స్థితిగతులు, ప్రమాదాల్లో గాయాల తీవ్రత వంటి అంశాలను తెలుసుకోవడంలో సీటీ స్కాన్ కీలకంగా ఉంటుంది. హెచ్ఆర్ సీటీ స్కాన్ ద్వారా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులను స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుంది. మెదడు సంబంధిత వ్యాధులు, పక్షవాతం, మెదడు కణుతులు, ప్రమాదాల్లో గాయాలు తదితర సమస్యలను గుర్తించడంలో కూడా సీటీ స్కాన్ సేవలు ఉపయోగపడు తున్నాయి. ఈ సేవలు ప్రభుత్వ ఆసుపత్రి లోనే అందుబాటులో ఉండటం వల్ల రోగులు బయటకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతోంది. రేడియాలజీ సేవలకు నిపుణుల బలం: గతంలో రేడియాలజిస్టుల కొరత కారణంగా రేడియాలజీ సేవల నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్య తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవ తీసుకుని రేడియాలజీ సేవలను బలోపేతం చేసే చర్యలు చేపట్టారు. ఇటీవల డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. దీంతో రేడియాలజీ విభాగానికి మరింత నిపుణుల బలం చేకూరింది. అదే విధంగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా, పరిధిలోని వైద్య నిపుణుడు డాక్టర్ మురళీకృష్ణను సర్వజనాసుపత్రికి కేటాయించేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫలితంగా రేడియాలజీ సేవలు మరింత పటిష్టమై ప్రజలకు నాణ్యమైన నిర్ధారణ సేవలు అందించే అవకాశం ఏర్పడింది. వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు: ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన మానవ వనరులపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసేలా చర్యలు చేపట్టారు. వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు వాటిని సమర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన వైద్య నిపుణుల సేవలు కూడా అందుబాటులోకి రావడం ద్వారా ఆసుపత్రి వైద్య సామర్థ్యం మరింత పెరుగుతోంది. పరికరం రావడమే కాదు.. నిరంతర సేవలు అందించడమే లక్ష్యం: కొత్త వైద్య పరికరాలు అందుబాటులోకి రావడం ఒక దశ మాత్రమే. వాటిని ప్రజలకు నిరంతరం ఉపయోగపడేలా చేయడం మరింత ముఖ్యమైన అంశం. ఈ దిశగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. యంత్రాల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులు, విద్యుత్ సదుపాయాలు, వైద్య నిపుణుల అందుబాటు, సిబ్బంది ఖాళీల భర్తీ వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటు లో ఉండటమే కాకుండా వాటి ద్వారా ప్రజలకు నిరంతర సేవలు అందే పరిస్థితి ఏర్పడుతున్నది. పేదలకు ఆర్థిక భారం తగ్గిస్తూ.. నాణ్యమైన వైద్యం: అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఆర్థిక భరోసా లభిస్తోంది. అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ, టిఫ్ఫా వంటి అనేక సేవలు అందుబాటులో ఉండటంతో ఖరీదైన ప్రైవేటు పరీక్షా కేంద్రాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతోంది. గర్భిణీల నుంచి చిన్నారుల వరకు, సాధారణ రోగుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి వరకు వివిధ వర్గాలకు అవసరమైన వైద్య సేవలను ఒకే ప్రభుత్వ వైద్య వ్యవస్థలో అందించే దిశగా ఆసుపత్రి ముందుకు సాగుతోంది. ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం: ఆసుపత్రిలో అందుబాటులోకి వస్తున్న కొత్త సేవలను ప్రజలు క్రమంగా వినియోగించు కుంటున్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు అల్ట్రాసౌండ్ సేవల్లో నమోదైన 13,816 పరీక్షలు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన 16,961 స్కాన్లు దీనికి నిదర్శనం. అత్యాధునిక పరీక్షా సదుపాయాలు, వైద్య నిపుణుల సేవలు, నిరంతర రేడియాలజీ సేవలు, అత్యవసర రోగులకు పడక వద్దే ఎక్స్‌రే వంటి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతోంది. ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు.. ప్రభుత్వ సేవలను వినియోగించుకోండి: ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అయ్యే వరకు వేచి చూడకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించు కోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. వైద్యుల సూచన మేరకు అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ వంటి పరీక్షలను వినియోగించుకోవాలి. గర్భిణీలు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందుబాటులో ఉన్న ఓబీజీ, టిఫ్ఫా, ఇతర స్కానింగ్ సేవలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి. శిశువు ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని అవసరమైన వైద్య ప్రణాళిక రూపొందించు కోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని మరింతగా కాపాడుకోవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రి.. ప్రజల ఆరోగ్యానికి భరోసా: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సదుపాయాలు విస్తరిస్తున్నాయి. కొత్త పరికరాలు, అధునాతన పరీక్షలు, నిపుణుల సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర సేవలు ఇలా ప్రతి విభాగంలోనూ సామర్థ్యాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలు ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రి మీ ఆరోగ్యానికి అందుబాటులో ఉంది.. ఆధునిక వైద్య సేవలు మీ కోసం అందుతున్నాయి.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

జర్నలిస్టులకు 'ఎల్ఐజీ, స్కీంను వర్తింపజేయండి

- హౌసింగ్ టవర్లు నిర్మించి 2బీహెచ్ కే ఫ్లాట్లు ఇవ్వండి - లేదా 200 గజాల స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి - ఖమ్మం ప్రెస్ క్లబ్ పై విచారణ పూర్తి చేసి ఎన్నికలు జరపండి - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కోరిన డబ్ల్యూజేఐ ప్రతినిధులు - విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర టి.ఎస్

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11: జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య, ఖమ్మం ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ దివాకర టి.ఎస్‌ను కలిశారు. ప్రస్తుతం హైదారాబాద్ లో అమలు చేస్తున్న ఎల్ఐజీ (లో ఇన్కమ్ గ్రూప్) స్కీమును జర్నలిస్టులకు కూడా వర్తింపజేయాలని కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా హౌసింగ్ టవర్లు నిర్మించి, వాటిలో సుమారు 1200 అడుగుల విస్తీర్ణంలో 2బీహెచ్ కే ఫ్లాట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇది సాధ్యం కానీ పక్షంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు 200 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇంటిని కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్.రావు), జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో కన్వీనర్ ఏం.ఏ అన్వార్ పాషా, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ మరియు ప్రెస్ క్లబ్ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబ రావు, ఏనిగండ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్ తదితరులు కలెక్టర్ దివాకర టి.ఎస్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై కూడా డబ్ల్యూజేఐ ప్రతినిధులు కలెక్టర్ తో సుదీర్ఘంగా చర్చించారు. చాలా కాలంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు జరగడంలేని తెలిపారు. ప్రస్తుతం, ప్రెస్ క్లబ్ నిర్వహణపై జరుగుతున్న విచారణను వెంటనే పూర్తి చేసి, ఎన్నికలు జరపాలని కోరారు. ఈ అంశంపై కూడా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర టి.ఎస్, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని డబ్ల్యూజేఐ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

- సుల్తానాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడలు - నాలుగు మండలాల నుండి క్రీడాకారుల హాజరు
- విజేతలకు బహుమతులు అందజేసిన తహసీల్దార్ బషీరుద్దీన్

సుల్తానాబాద్, సెప్టెంబరు 11: క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుల్తానాబాద్ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ జోనల్ స్థాయి పోటీల్లో భాగంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికలు తమ ప్రతిభను కనబరిచారు. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు సాయంత్రం జరిగిన ముగింపు వేడుకల్లో సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరుద్దీన్, పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ సురేష్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఉట్ల వరప్రదీప్, జోనల్ కార్యదర్శి దాసరి రమేష్, మండల కార్యదర్శి తాండ్ర ప్రణయ్, సీనియర్ క్రీడాకారులు అమిరిశెట్టి తిరుపతి, కుమార్ కిషోర్, భైరగోని రవీందర్ గౌడ్, అంతటి సంతోష్ గౌడ్, బొల్లి సత్యం, గెల్లు మధుకర్, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు , క్రీడాకారులు పాల్గొన్నారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్లక్ష్యం చేయొద్దు

ఓటర్ల కోసమే ప్రత్యేక పని దినాలు: కందుకూరు ఈఆర్ఓ జగదీశ్వర్ రెడ్డి

మహేశ్వరం సెప్టెంబర్ 11, :ఓటర్ల కోసం ప్రత్యేక పని దినాలు నిర్వహిస్తున్నామని కందుకూరు ఈఆర్ఓ జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు (ఆదివారము) రేపు (సోమవారము) ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక పని దినాలు నిర్వహిస్తు న్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని బిఎల్వోస్ సూపర్వైజర్స్ ఏఈఆర్ఓ లకు సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి అవసరమైన సహాయక పత్రాలు సేకరించాలన్నారు. ఓటర్లు సమర్పించిన పత్రాలను సంబంధిత వివరాలతో సక్రమంగా పరిశీలించి ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. బి ఎల్ వో లు తమ పరిధిలోని ఓటర్లకు ముందస్తుగా సమాచారం అందించి అవసరమైన పత్రాలతో రావాలని అవగాహన కల్పించాలన్నారు. ఏ ఈ ఆర్ వో లు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసులను త్వరితగా పరిష్కరించేల చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు తమకు సంబంధించిన నోటీసులను నిర్లక్ష్యం చేయకుండా సూచించిన గడువులోగా అవసరమైన పత్రాలను సంబంధిత బిఎల్ఓ లకు సమర్పించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సహకరించాలని ఈఆర్ఓ జగదీశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఖమ్మంపాడులో రైతు శిక్షణా కార్యక్రమం

మధిర ప్రతినిధి :సెప్టెంబర్ 11: మధిర మండలం పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో శుక్రవారం నాడు ఏటీఎం (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ) ఐ. వాణి శ్రీ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అవలంబించి పంటలలో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, ఎరువులు పురుగుమందులను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) కె. సాయిదీక్షిత్ మాట్లాడుతూ ప్రస్తుత పంటల పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, సమతుల్య ఎరువుల వినియోగం, పురుగు--తెగుళ్ల నివారణ మరియు శాస్త్రీయ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏటీఎం ద్వారా నిర్వహిస్తున్న రైతు శిక్షణా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యానవన అధికారి విష్ణులి ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతిక పద్ధతులు, పంటల యాజమాన్యం, పురుగు--తెగుళ్ల నివారణ మరియు ఉద్యాన పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ అంజన బాబు మాట్లాడుతూ రైతుల కోసం ఏటీఎం వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులతో పంటల సాగుకు సంబంధించిన అంశాలపై చర్చించి, వారి సందేహాలకు వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారులు సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సుష్మ, ప్రవళిక, జిష్ణు ఖమ్మంపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

క్వార్టర్స్ కౌన్సిలింగ్ తక్షణమే అలాట్‌మెంట్ లెటర్ల అందజేత

అభినందించిన ఆర్జీ-త్రీ జి.యం సుంకర మధుసూదన్

రామగిరి, సెప్టెంబర్ 11:- రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికారులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్స్ కేటాయింపునకు సంబంధించి శుక్రవారం జీఎం కార్యాలయంలో క్వార్టర్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ లో అర్హత కలిగిన, హాజరైన అధికారులు క్వార్టర్స్ ఎంపిక చేసుకోవడం జరిగింది. కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే, క్వార్టర్స్ ఎంపిక చేసుకున్న అధికారులకు తక్షణమే క్వార్టర్ అలాట్మెంట్ లెటర్లను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ గతంలో కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అలాట్మెంట్ లెటర్లను అందజేయడానికి సుమారు వారం రోజుల సమయం పట్టేది. అయితే అధికారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా అలాట్మెంట్ లెటర్లను అందజేయడం జరిగిందని, ఇదేవిధంగా ఎన్ సి డబ్యు ఎ ఉద్యోగులకు కూడా అలాట్మెంట్ లెటర్ కౌన్సిలింగ్ లోనే అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.రామగుండం -త్రీ ఏరియాలో మొదటి సారి ఇలాంటి చర్యలను చేపట్టిన క్వార్టర్స్ కమిటీ కన్వీనర్, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, సంబంధిత అధికారులను, కమిటీ సభ్యులను, పర్సనల్ విభాగం క్వార్టర్స్ సెక్షన్ డి వై పిఎం ఎన్.వంశీధర్, సీనియర్ అసిస్టెంట్ కె.రమ్యా రెడ్డి అభినందించారు.క్వార్టర్స్ కేటాయింపులో తక్షణమే అలాట్మెంట్ లెటర్లు అందజేయడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎస్టేట్స్ అధికారి కె.శ్యామల, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడిగా మద్దె శ్రవణ్ గౌడ్ నియామకం

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం - రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు



పెద్దపల్లి ప్రతినిధి : వినియోగదారుల హక్కుల సంస్థ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా మద్దె శ్రవణ్ గౌడ్ నియమితులయ్యారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు ఈ నియామకాన్ని ప్రకటించారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నూతన జిల్లా కమిటీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తెలంగాణలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం తమ సంస్థ గత 13 ఏళ్లుగా నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. గత ఐదేళ్లుగా సంస్థ కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, మారుమూల గ్రామాలు, మండలాలకు సైతం వెళ్లి వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నికైన నేపథ్యంలో, ఆయన అంగీకారంతో కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రవణ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు వెల్లడించారు. మద్దె శ్రవణ్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో 20 నుంచి 30 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేసి సంస్థ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా వినియోగదారులకు అన్యాయం జరిగినా, వారి హక్కులకు భంగం కలిగినా వెంటనే స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వినియోగదారులకు అవసరమైన చట్టపరమైన సలహాలు, సూచనలు అందించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో అధికారిక, న్యాయపరమైన సహాయాన్ని రాష్ట్ర కమిటీ తరఫున అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.మద్దె శ్రవణ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సంస్థ రాష్ట్ర, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వినియోగదారుల హక్కులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర, జాతీయ నాయకుల సహకారంతో పెద్దపల్లి జిల్లాలో సంస్థను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు గుడపర్తి శివ, వల్లాల రవి, స్టేట్ సెక్రటరీలు దుర్గ ప్రసాద్, రామేశ్వరం రాజేష్, స్టేట్ జాయింట్ సెక్రటరీ కాస రాజు యాదవ్, కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ కొయ్యడ రాజు, కరీంనగర్ ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ వరాల జ్యోతి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాదే శేఖర్, మంచిర్యాల ప్యాట్రన్ మెంబర్ ఇందూరి రమేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

రంజీ ట్రోఫీ షెడ్యూల్ మార్పులపై గవాస్కర్ ఆగ్రహం

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూపొందించిన దేశవాళీ షెడ్యూల్‌పై టీమ్ ఇండియా దిగ్గజ మాజీ సారథి సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రెడ్ బాల్ టోర్నీ రంజీ ట్రోఫీని బోర్డు చిన్నచూపు చూస్తోందని విమర్శించాడు. ప్రస్తుత క్యాలెండర్ ప్రకారం రంజీ ట్రోఫీని రెండు దశలుగా విభజించి, వాటి మధ్యలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ షెడ్యూలింగ్ గందరగోళంపై స్పోర్ట్‌స్టార్ కాలమ్‌లో గవాస్కర్ స్పందిస్తూ, "ఒక వైట్ బాల్ టోర్నమెంట్ కోసం రెడ్ బాల్ టోర్నమెంట్‌ను మధ్యలోనే ఎలా ఆపేస్తారు? ఇది ఆటగాళ్ల రిథమ్, మొమెంటమ్‌ను పూర్తిగా నాశనం చేస్తుంది" అని ఆవేదన చెందాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని సెప్టెంబర్‌లోనే నిర్వహించవచ్చని, కానీ ఐపీఎల్ వేలానికి సమీపంలో ఉండాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఇలా చేస్తోందని గవాస్కర్ విమర్శించాడు. "రంజీ ట్రోఫీ తరహాలోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కూడా క్వార్టర్ ఫైనల్ వరకు ఆడి, కొద్ది వారాల విరామం తర్వాత సెమీస్, ఫైనల్స్ నిర్వహించవచ్చు కదా? అలా చేయరు. ఎందుకంటే ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఒకవేళ వేలం రెండు నెలల తర్వాత జరిగినా ఫ్రాంచైజీలు ప్రతిభావంతులైన ఆటగాళ్లను మరిచిపోరు" అని అతడు తెలిపాడు. ఆట అసలు సిసలైన పునాది అయిన ఫస్ట్ క్లాస్ క్రికెట్‌ను పక్కనపెట్టి లీగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం సరైంది కాదని తెలిపాడు. ప్రస్తుత బీసీసీఐ వ్యవస్థలో అనుభవం లేని వ్యక్తుల జోక్యం పెరగడం వల్లే ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వస్తున్నాయని గవాస్కర్ విమర్శించాడు. గతంలో బోర్డులో టెక్నికల్ కమిటీ, ఫిక్చర్స్ కమిటీ ఉండేవని గుర్తుచేశాడు. "గతంలో మాజీ ఆటగాళ్లు, సీనియర్ అంపైర్లు, అనుభవజ్ఞులైన నిర్వాహకులు ఆ కమిటీల్లో సభ్యులుగా ఉండి మ్యాచ్‌ల నిర్వహణ సజావుగా సాగేలా చూసేవారు. అలాంటి అనుభవజ్ఞుల సేవలను మళ్లీ వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత భారత క్రికెట్ వ్యవస్థ కాస్త దారితప్పింది, సరైన నిపుణుల సలహాలతో దాన్ని సరిచేయాలి" అని సూచించాడు. టెస్ట్ క్రికెట్‌కు ఆటగాళ్లను అందించే రంజీ ట్రోఫీ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలని, షెడ్యూలింగ్ లో నిలకడ లేకపోతే యువ క్రికెటర్ల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు.

సారాతో సందడి చేసిన శుభమన్

భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన యువీక్యాన్ ఫౌండేషన్ కోసం జులై 8, 2025న లండన్‌లో ఒక ఛారిటీ డిన్నర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ విందులో క్రికెట్ ప్రపంచంలోని అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడానికి, చికిత్స కోసం నిధులు సేకరించడానికి ఈ డిన్నర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విందుకు భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన టీమ్ మొత్తంతో కలిసి వచ్చాడు. ఈ నేపథ్యంలో శుభమన్ గిల్ ఒక ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ గిల్‌తో కలిసి కనిపించడం మళ్ళీ చర్చకు దారితీసింది.క్యాన్సర్ మహమ్మారిని జయించిన తర్వాత యువరాజ్ సింగ్ 2011లో యువీక్యాన్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. ఈ ఫౌండేషన్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడానికి, ముందుగానే గుర్తించడాన్ని ప్రోత్సహించడానికి, రోగులకు ఆర్థిక సహాయం అందించేందుకు పనిచేస్తుంది. దానిలో భాగంగానే లండన్‌లో జరిగిన ఈ ఛారిటీ డిన్నర్ లక్ష్యం ఫౌండేషన్ కోసం నిధులను సేకరించడం. ఇప్పుడు ఈ కార్యక్రమంలో శుభ్‌మన్ గిల్, సారా టెండూల్కర్ కనిపించిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది.వైరల్ అవుతున్న ఫోటోలో శుభ్‌మన్ నవ్వుతూ కనిపించాడు. సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ అతని ముందు కూర్చుని ఉంది. అయితే, ఈ ఫోటో గిల్ తన జట్టుతో విందుకు వచ్చినప్పుడు, సారా అప్పటికే అక్కడ ఉన్నప్పుడు తీసినది అని చెబుతున్నారు. సారా టెండూల్కర్ ఈ ప్రోగ్రాం ఫోటోను తన సోషల్ మీడియా అకౌంట్లో షేర్ చేసింది. అందులో ఆమె తన ఫ్రెండ్స్?తో కనిపించింది.శుభ్‌మన్ గిల్ పేరు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్‌తో చాలాసార్లు వినిపించింది. ఒకానొక సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ సంబంధం ఉన్నట్లు వదంతులు ప్రచారంలోకి వచ్చాయి. దీనికి బలం చేకూర్చేలా ఇద్దరూ గతంలో సోషల్ మీడియాలో ఒకరినొకరు ఫాలో అయ్యేవారు. అలాగే, పరస్పరం పోస్ట్‌లకు లైక్ చేయడం, కామెంట్ చేయడం కూడా జరిగేది. కానీ ఆ తర్వాత ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం ద్వారా వదంతులకు తెర దించారు. అయితే, శుభ్‌మన్, సారా ఈ వదంతుల గురించి ఇప్పటివరకు బహిరంగంగా నోరు విప్పలేదు.

భారత్ దెబ్బకు బిచ్చమెత్తుకుంటోన్న పీసీబీ

భారత్‌తో శత్రుత్వం పెంచుకోవడం ద్వారా పాకిస్తాన్ పెద్ద తప్పు చేసింది. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద సంఘటన తర్వాత, మే 6, 7 తేదీల్లో రాత్రి పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను భారతదేశం ధ్వంసం చేసింది. అప్పటి నుంచి భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఈ ఉద్రిక్తత కారణంగా, మే 8న రావల్పిండిలో జరగాల్సిన పాకిస్తాన్ సూపర్ లీగ్ మ్యాచ్ రద్దు చేశారు. ఇది మాత్రమే కాదు, పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో పాల్గొనే విదేశీ ఆటగాళ్లందరూ కూడా భయాందోళనలో ఉన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే కొంతమంది విదేశీ ఆటగాళ్ళు తమ దేశానికి తిరిగి రావడం గురించి ఫ్రాంచైజీలతో ఇప్పటికే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితిలో, పిఎస్ఎల్ 10వ సీజన్ ఇప్పుడు రద్దు అయ్యే ప్రమాదం ఉంది. ఎందుకంటే పాకిస్తాన్ వైపు నుంచి నిరంతరం డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో, భారతదేశం ప్రతీకారం తీర్చుకుంటే, పిఎస్ఎల్ ఈ సీజన్ పూర్తి చేయడం కష్టం. ఎందుకంటే, పాకిస్తాన్‌లోని కొన్ని ప్రధాన స్టేడియాలు భారత సరిహద్దుకు చాలా దగ్గరగా ఉన్నాయి. ఇది జరిగితే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు దివాళా తీస్తుంది. ఎందుకంటే, ఈ లీగ్ కారణంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నిరంతరం నష్టాలను చవిచూస్తోంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మాత్రమే కాదు, 6 జట్ల యజమానులు కూడా భారీ నష్టాలను చవిచూస్తారు. ఆడిట్ నివేదిక ప్రకారం, గత ఐదు సీజన్లలో పిఎస్ఎల్ నుంచి పీసీబీ భారీ నష్టాలను చవిచూస్తోంది . ఫ్రాంచైజీకి ఎక్కువ వాటా ఇవ్వడం వల్ల ఈ నష్టం సంభవించింది. ఆడిట్ నివేదిక ప్రకారం, పిఎస్-ఎల్ ఫ్రాంచైజీలకు అధిక వాటాలు ఇవ్వడం వల్ల పాకిస్తాన్ క్రికెట్ బోర్డు రూ.1,637.977 మిలియన్ల నష్టాన్ని చవిచూసింది. పీసీబీ, ఫ్రాంచైజీ మధ్య 10 సంవత్సరాల ఒప్పందం ఉంది. 2025 లో 10 సంవత్సరాలు పూర్తయిన తర్వాత మాత్రమే ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి అనుమతి ఉంటుంది.

మళ్లీ పూర్తి రిథమ్ సాధించా..

భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్

శ్రీలంక టూర్ సందర్భంగా తన బౌలింగ్ వేగం, రిథమ్ పడిపోవడంపై భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ పెదవి విప్పాడు. రెండు నెలల పాటు ఆటకు పూర్తిగా దూరంగా ఉండటం వల్లే క్రీజులో ఇబ్బంది పడ్డానని, అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయడం ద్వారా తిరిగి పాత లయను అందుకున్నానని తెలిపాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ సాధారణంగా వేసే 140 కిలోమీటర్ల వేగానికి బదులు కేవలం 120ల వేగంతోనే బంతులు విసిరాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 44 ఓవర్లు వేసినప్పటికీ బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయాడు. దీనిపై దులీప్ ట్రోఫీ ఫైనల్ అనంతరం సిరాజ్ మాట్లాడుతూ, "రెండు నెలల సుదీర్ఘ బ్రేక్ తర్వాత నేరుగా మ్యాచ్‌లోకి అడుగుపెట్టడంతో నా రిథమ్ దెబ్బతింది. నేను పూర్తిగా రిథమ్‌పై ఆధారపడే బౌలర్‌ని. శరీర కదలికలు సమన్వయంలో లేకపోతే క్రీజులో వేగం చూపించలేను. నా రన్‌అప్‌లో కొన్ని అడుగులు చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా పడటంతో ఫ్లో మిస్సయి పేస్ తగ్గింది" అని వివరించాడు. జూన్ 8న అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ ముగిసిన తర్వాత రెండు నెలల విశ్రాంతి తీసుకుని ఆగస్టు 7న శ్రీలంక పర్యటనకు సిరాజ్ వెళ్లాడు. అయితే చేపాక్‌లో ఈస్ట్ జోన్‌తో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్ తరఫున 41 ఓవర్ల పాటు బౌలింగ్ చేయడం ద్వారా రాబోయే కఠినమైన సీజన్‌కు తన శరీరం పూర్తిగా సిద్ధమైందని సిరాజ్ భావిస్తున్నాడు. "ఇక్కడ అంతా దారికొచ్చింది, దాంతో సహజంగానే పేస్ పెరిగింది. కొలంబో టెస్ట్ తర్వాత కేవలం వారం రోజుల్లోనే చెన్నైకి వచ్చి భానుడి ప్రతాపంలో బౌలింగ్ చేయడం చాలా కష్టమనిపించింది. కానీ దేశానికి ఆడుతున్నప్పుడు ఎలాంటి సాకులు చెప్పకూడదు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్లు రాకపోయినా, పడిన కష్టం అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తప్పక ఫలితాన్ని ఇస్తుంది. నా పదేళ్ల కెరీర్‌లో ఎప్పుడూ రెండు నెలల బ్రేక్ తీసుకోలేదు. నా శరీరం ఎక్కువ ఓవర్లు వేస్తేనే మెరుగ్గా స్పందిస్తుంది" అని అన్నాడు. ఈ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రత్యర్థి ఈస్ట్ జోన్ తరఫున ఆడిన తన పాత భాగస్వామి మహమ్మద్ షమీతో సిరాజ్ కాసేపు మాట్లాడాడు. ఈ సంభాషణ గురించి షమీ స్పందిస్తూ, "మొదటి ఇన్నింగ్స్‌లో సిరాజ్ తన సహజమైన రిథమ్ కోసం ఇబ్బంది పడ్డాడు. మళ్లీ ఫామ్‌లోకి రావాలంటే నీ సహజమైన బలాలపై మాత్రమే దృష్టి పెట్టాలని అతడికి గుర్తుచేశాను. రన్‌అప్, రిథమ్ సరిగ్గా కుదిరితే లైన్ అండ్ లెంగ్త్ ఆటోమేటిక్‌గా సెట్ అవుతాయి" అని తెలిపాడు. సీనియర్ బౌలర్ ఇచ్చిన సలహాలు సిరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుగ్గా బౌలింగ్ చేయడానికి తోడ్పడ్డాయి. పూర్తి ఫిట్‌నెస్‌తో పాటు రన్‌అప్ గాడిన పడటంతో రాబోయే న్యూజిలాండ్ సిరీస్‌లో సిరాజ్ మునుపటి వాడివేడి బంతులతో చెలరేగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజెంట్ సిరాజ్.. ఎక్కువగా అంతర్జాతీయ టెస్టులు మాత్రమే ఆడుతున్నాడు.

అన్ క్యాప్డ్ ప్లేయర్ రూల్‌పై గావస్కర్ విమర్శలు

గతేడాది ఐపీఎల్ మెగా వేలానికి ముందు తీసుకొచ్చిన అన్ క్యాప్డ్ ప్లేయర్ రూల్ ను దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ విమర్శించాడు. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కోసమే బీసీసీఐ ఈ రూల్ తీసుకొచ్చిందని మండిపడ్డాడు. ఈ రూల్ ప్రకారం అంతర్జాతీయ క్రికెట్ వరుసగా ఐదేళ్లు ఆడని ప్లేయర్లని అన్ క్యాప్డ్ ప్లేయర్ కేటగిరీలో రిటైన్ చేసుకోవచ్చు. ఇలాంటి ఆటగాళ్లకు గరిష్టంగా రూ.4 కోట్ల వరకు చెల్లించవచ్చు. ముఖ్యంగా ఈ రూల్ ద్వారా చెన్నై జట్టు బాగా లాభపడింది. ధోనీ లాంటి ఆటగాడిని కేవలం రూ.4 కోట్లకే దక్కించుకుంది. అతని కోసమే ఇలాంటి రూల్ ను రూపొందించారా.? అని చాలా విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే సందీప్ శర్మను కూడా అన్ క్యాప్డ్ ప్లేయర్ హెూదాలోనే ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ రిటైన్ చేసుకుంది. ఇలా 12 మంది ప్లేయర్లను రిటైన్ చేసుకోగా.. ఇందులో అంతర్జాతీయ క్రికెట్ ఆడి లాభపడిన ఐదారుగురు క్రికెటర్లు ఉన్నారు. ఐపీఎల్లో యువ ఆటగాళ్లకు అందించే ప్రైజ్ మనీపై ఆంక్షలు ఉండాల్సిన అవసరముందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ వేలంలో అంచనాలకు మించి, కోట్ల రూపాయలకు అమ్ముడు పోయిన ప్లేయర్లు తర్వాత ఆటలో ఘోరంగా విఫలమయ్యారని గుర్తు చేశాడు. ఇలా పెద్దమొత్తంలో వచ్చిన అమౌంట్ ఆటగాళ్ల ఏకాగ్రతను, ఆటపై చిత్తశుద్ధిని దెబ్బతీస్తోందని వ్యాఖ్యానించాడు. ఆటగాళ్లలో ఆడాలన్న కసిని, చంపేస్తుందని పేర్కొన్నాడు. ఏదేమైనా ఐపీఎల్ యాజమాన్యం దీనిపై దృష్టి సారించాలని పేర్కొన్నాడు. ఇక గతేడాది మెగా వేలంలో కోట్లాది రూపాయల ధరతో ఆటగాళ్లపై కనకవర్షం కురిసింది. రూ.27 కోట్లతో రిషభ్ పంత్ ను లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. 18 ఏళ్ల లీగ్ చరిత్రలో తనే అత్యంత ఖరీదైన ప్లేయర్ కావడం విశేషం. అయితే తనకు పెట్టిన ధరకు అనుగుణంగా పంత్ రాణించలేక పోతున్నాడు.

బ్యాటింగ్ లైనప్‌పై టీమిండియాకు తలనొప్పే

సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో బ్యాటింగ్ లైనప్‌ను ఎంచుకోవడం టీమిండియాకు తలనొప్పేనని సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా తిలక్ వర్మను ఏ స్థానంలో ఆడిస్తారని, అతని ఎంపిక సవాల్‌గా మారుతుందని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌లో తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహాలు నెలకొన్నాయని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. ఆరు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో 3-0తో సిరీస్‌ను గెలుచుకుంది. సెప్టెంబర్ 13 నుంచి సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అనంతరం జపాన్‌తో చారిత్రాత్మక టీ20తో పాటు అక్కడే జరిగే ఆసియా గేమ్స్ 2026లో పాల్గొననుంది. టీమిండియా కాంబినేషన్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన డివిలియర్స్.. తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహం వ్యక్తం చేశాడు. 'బ్యాటర్లను ఎంపిక చేయడంలో కచ్చితంగా కొన్ని సమస్యలు ఉంటాయి. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ ఉన్నారు. ఇక్కడే టీమ్ కాంబినేషన్ ఎంచుకోవడం కొంచెం కష్టం అవుతుంది. తిలక్ వర్మ ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు? ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత తిలక్ వర్మ 10 ఇన్నింగ్స్‌ల్లో 159.36 స్ట్రైక్‌రేట్‌తో 255 పరుగులు చేశాడు. అయితే అతను కేవలం మూడు సార్లు మాత్రమే 50 పరుగుల మార్కును దాటాడు. ఇది అతని బ్యాటింగ్‌లోని నిలకడలేనితనాన్ని సూచిస్తుంది. ఇది చాలా బలమైన జట్టు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సరైన సమతుల్యతను సాధించడం కష్టం. ఇది టీ20 మ్యాచ్ కాబట్టి, వారు జట్టులోని చిన్న మార్పులు చేసి ఆడవచ్చు. ఆటగాళ్ల పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. అఫ్గానిస్థాన్ వంటి ప్రమాదకరమైన జట్టును ఎదుర్కోబోతున్నందుకు ప్రతీ ఆటగాడి బాధ్యతను గుర్తు చేయడం చాలా కీలకం.'అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.

విశ్వజ

దేవుడు వచ్చిన వరమే ఈ పండు..

ఆ ప్రాబ్లమ్ ఉన్నోళ్లకి ఇది దివ్యౌషధం..

వేసవి వచ్చిందంటే చాలు మామిడి పండ్లతో పాటు మనకు గుర్తొచ్చే మరో అద్భుతమైన పండు నేరేడు. తియ్యదనం, వగరు కలగలిపిన తన ప్రత్యేకమైన రుచితో ఈ పండుతో మనల్ని కట్టిపడేస్తుంది. అయితే నేరేడు పండు కేవలం రుచికి మాత్రమే పరిమితం కాదు అది ఒక ఔషధ గని. సంవత్సరంలో కొద్ది నెలలు మాత్రమే లభించే ఈ పండు..తనలో ఎన్నో ఆరోగ్య రహస్యాలను దాచుకుంది. ముఖ్యంగా మధుమేహంతో బాధపడేవారికి ఇది ఒక సంజీవనిలా పనిచేస్తుందని ఆయుర్వేదం బలంగా చెబుతోంది. ఆయుర్వేదంలో నేరేడు ప్రాముఖ్యత శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యంలో నేరేడు పండుకు చాలా ప్రముఖ స్థానం ఉంది. కేవలం నేరేడు పండు మాత్రమే కాకుండా దాని గింజలు, బెరడు, ఆకులు కూడా ఎన్నో వ్యాధుల నివారణకు ఉపయోగపడతాయి. నేరేడు పండులోని గుణాలు శరీరంలోని కఫ, పిత్త దోషాలను సమతుల్యం చేయడానికి సహాయపడతాయి. ఈ సహజ సిద్ధమైన లక్షణాలే మధుమేహాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గింజలలో దాగి ఉన్న అసలైన శక్తి నేరేడు పండు అసలైన శక్తి దాని గింజలలో దాగి ఉందని చెప్పవచ్చు. ఈ గింజలను ఎండబెట్టి పొడి చేసి వాడటం వల్ల మధుమేహంపై అద్భుతమైన ప్రభావాన్ని చూపవచ్చు. నేరేడు గింజలలో జాంబోలిన్, జాంబోసిన్ అనే రెండు శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మన శరీరంలో పిండిపదార్థాలు చక్కెరగా మారే ప్రక్రియను నెమ్మదింపజేస్తాయి. దీనివల్ల భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రణలో ఉంటాయి. పోషకాల గని, ఆరోగ్య ప్రయోజనాలు నేరేడు పండు ఒక పోషకాల నిధి. ఇందులో విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం, ఫాస్పరస్ వంటి విటమిన్లు, ఖనిజాలతో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. రోగనిరోధక శక్తి విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంపొందించి ఇన్ఫెక్షన్ల నుండి కాపాడతాయి. ఇన్సులిన్ సున్నితత్వం నేరేడును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇది కణాలు గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునేలా చేసి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. జీర్ణక్రియ, బరువు నియంత్రణ అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి ఊబకాయం వంటి మధుమేహానికి సంబంధించిన ప్రమాద కారకాలను తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. భోజనం తర్వాత ఈచిన్న పని చేస్తే ఆ పెద్ద సమస్యకు చెక్ పెట్టొచ్చు..గ్యాస్ రిలీజ్ కూడా! షుగర్ లెవల్ ని నియంత్రించడానికి నేరేడును ఎలా ఉపయోగించాలి? మధుమేహ నియంత్రణ కోసం నేరేడు పండును వివిధ రకాలుగా మన ఆహారంలో చేర్చుకోవచ్చు. సీజన్‌లో దొరికే తాజా నేరేడు పండ్లను తినడం ఉత్తమమైన మార్గం. ఇది శరీరానికి తక్షణ శక్తిని, తాజాదనాన్ని ఇస్తుంది. నేరేడు గింజలను సేకరించి, శుభ్రంగా కడిగి, ఎండబెట్టి, మెత్తని పొడిగా చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం పరగడుపున అర టీస్పూన్ పొడిని గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. నేరేడు పండ్లతో తయారుచేసిన వెనిగర్ జీర్ణక్రియకు సహాయపడటమే కాకుండా బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది.

జుట్టు రాలటానికి మూలాలివే.. ఇవి తెలిస్తే నివారణ సాధ్యం!

జుట్టు రాలడం అతి పెద్ద సమస్య, దీనికి అనేక కారణాలున్నాయి. జుట్టు రాలటానికి పోషక లోపాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఎందుకంటే అనేక వ్యక్తులు అవసరమైన విటమిన్లు మరియు ఖనిజాలను ఆహారంలో తీసుకోవటం లేదు. ఒత్తిడి మరియు ఆందోళన కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణాలు. చాలా మంది అనుసరించే వేగవంతమైన జీవనశైలి కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణంగా మారుతుంది.

జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు వాతావరణ మార్పులు, వాతావరణ నమూనాలలో మార్పులు వంటి వాటి వల్ల జుట్టు ఆరోగ్యం ప్రభావితమవుతుంది. కొన్ని జుట్టు సంరక్షణ ఉత్పత్తుల వినియోగం కూడా ప్రతికూల ప్రభావాలను కలిగి ఉండవచ్చు. అదనంగా, జీర్ణ సంబంధ ఆరోగ్య సమస్యలు జుట్టు రాలడాన్ని ప్రభావితం చేయవచ్చు, జుట్టు రాలే సమస్యలు మొత్తం ఆరోగ్యానికి ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది.

జుట్టు రాలటంలో కీలక పాత్ర పోషించేవి ఇవే జెనెటిక్స్ జుట్టు రాలడంలో మరో కీలక అంశం. కుటుంబ చరిత్ర వ్యక్తులను ఈ సమస్య ముందు నుండి ఉంటే వారికి కూడా ఈ సమస్య తప్పక వస్తుంది. వయస్సుతో సంబంధిత హార్మోన్ల మార్పులు కూడా జుట్టు పలుచబడడం మరియు రాలడంలో తోడ్పడతాయి. ఈ సహజ ప్రక్రియలు తరచుగా నివారించలేనివి కానీ సరైన సంరక్షణతో జుట్టు బాగా రాలే సమస్యను తగ్గించవచ్చు.

జీవనశైలి, ఒత్తిడి జుట్టు ఆరోగ్యంపై ప్రభావం ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో పనులు చేసే జీవనశైలి ఒత్తిడి స్థాయిలను పెంచుతుంది. పరోక్షంగా జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. పర్యావరణ కాలుష్యం మరో సమస్య. ఇది జుట్టును హానికరమైన మూలకాలకు గురిచేస్తుంది. అంతేకాదు హానికరమైన రసాయనాల షాంపూ లను ఉపయోగించటం లేదా స్టైలింగ్ చేయటం కోసం ఉపయోగించే లేటెస్ట్ టెక్నాలజీలు కూడా పెరిగిన జుట్టు రాలడానికి దారితీస్తాయి.

జుట్టు రాలటానికి కారణాల అధ్యయనం నివారణకు కీలకం

ఈ కారణాలను అర్థం చేసుకోవడం జుట్టు రాలడాన్ని సమర్థవంతంగా పరిష్కరించడంలో సహాయపడుతుంది. జుట్టు పోషణపై దృష్టి పెట్టడం, ఒత్తిడిని తగ్గించుకోవటం మరియు అనుకూలమైన జుట్టు సంరక్షణ పద్ధతులను అవలంబించడం ద్వారా జుట్టు సంరక్షణకు కృషి చేయవచ్చు. కనుక జుట్టు రాలటానికి కారణాలు తెలుసుకుని తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? కారణాలు, లక్షణాలు, నివారణలు ఇవే!

ప్రస్తుత జీవన శైలి కారణంగా చాలామంది అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. అటువంటి అనారోగ్య సమస్యలలో మైగ్రేన్ ఒకటి. మైగ్రేన్ అనేది తీవ్రమైన తలనొప్పితో కూడిన నాడీ సంబంధిత రుగ్మత. ఇది సాధారణంగా ఒత్తిడి కారణంగా వస్తుంది. తలకు ఒక వైపున లేదా రెండు వైపులా విపరీతమైన నొప్పితో కొన్ని గంటల నుండి రోజుల వరకు కూడా ఈ నొప్పి ఉండవచ్చు. మైగ్రేన్ లక్షణాలు.. మైగ్రేన్ యొక్క సాధారణ లక్షణాలలో తలనొప్పి తీవ్రంగా ఉండవచ్చు. కంటి చూపులో మార్పులు, కంటి చూపు మందగింపు, చేతుల్లో జలదరింపు, కడుపులో వికారం, వాంతులు, విరోచనాలు, కాంతి మరియు శబ్ద సున్నితత్వం, నీరసం, విపరీతమైన అలసట, కండరాల బలహీనత, హార్మోన్ల మార్పులు, ఒత్తిడి, ఆందోళన వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయి. కుటుంబ చరిత్రలో మైగ్రేన్ ఉంటే కూడా మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలు ఇవి కూడా కావొచ్చు.. కొందరిలో శరీరం డీహైడ్రేషన్ కు గురైతే కూడా మైగ్రేన్ వస్తుంది. మెడనొప్పి ఎక్కువగా ఉన్నవారిలో కూడా మైగ్రేన్ వచ్చే ప్రమాదం ఉంది. క్రమరహిత జీవనశైలి, భావోద్వేగ ఒత్తిడి, తీవ్రమైన శారీరక శ్రమ, పానీయాలను ఎక్కువగా తీసుకోవడం, సరైన సమయానికి తినకపోవడం కూడా మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలుగా చెప్పవచ్చు.

వీటివల్ల మైగ్రేన్ తలనొప్పి ప్రమాదం

ఎక్కువగా ప్రయాణాలు చేసే వారిలోనూ, వాతావరణంలో మార్పుల కారణంగాను, వెన్నెముక సమస్యలు ఉన్న వారిలోనూ, ఎక్కువగా ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ, మైగ్రేన్ సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఓరల్ కాంట్రాసెప్టివ్ పిల్స్ లాంటివి వాడే వారిలోనూ, నిరాశ ఆందోళనలకు లోనయ్యే వారిలోనూ, నిద్ర రుగ్మతలు ఉన్న వారిలోనూ మైగ్రేన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

మైగ్రేన్ తలనొప్పి కారణంగా ఈ ప్రమాదం

మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారిలో కళ్ళు ఎర్రబడడం, కళ్ళల్లో నీళ్ళు రావడం, మాట్లాడలేకపోవడం, కళ్ళముందు జిగ్జాగ్ లైన్లు కనబడడం, శబ్దాలు వినిపించడం, కాళ్ళు చేతులలో తిమ్మిర్లు రావడం, తల తిరగడం, వాంతులు కావడం, వికారం అనిపించడం, తలలో తీవ్రమైన నొప్పి రావడం వంటి సాధారణమైన లక్షణాలు కనిపిస్తాయి. అయితే మైగ్రేన్ తలనొప్పి తగ్గాలంటే అన్నిటికంటే ముందుగా జీవనశైలి మార్పులు చేసుకోవాలి. క్రమం తప్పకుండా నిద్ర మరియు ఆహారపు అలవాట్లు చేసుకోవాలి.

మైగ్రేన్ తలనొప్పి తగ్గేందుకు ఇలా చెయ్యండి

ఒత్తిడి నిర్వహించడానికి యోగా, ధ్యానం వంటి వాటిని చేయాలి. మైగ్రేన్ తలనొప్పి ట్రిగ్గర్ అయ్యే ఆహారాలను నివారించాలి. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకునేందుకు తగినంత నీటిని తాగాలి. నొప్పి నివారణ ఔషధాలను, మైగ్రేన్ కు డాక్టర్ ఇచ్చే మందులను తప్పనిసరిగా వాడాలి. నొప్పి మొదలైనప్పుడు ప్రశాంతంగా నిశ్శబ్దంగా, కాంతిలేని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి. నొప్పి ఉన్నచోట వెచ్చని లేదా చల్లని కంప్రెస్ ను తలపైన పెట్టుకోవాలి. ఈ విధంగా మైగ్రేన్ తలనొప్పి నుంచి కొంతమేర ఉపశమనాన్ని పొందవచ్చు.

మార్కెట్

ఐపీవోకి లలితా జ్యువెల్లరీ

న్యూఢిల్లీ : ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జ్యువెల్లరీ..స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. ఈ వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.1,700 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.1,200 కోట్లు, కంపెనీ సీఎండీ కిరణ్ కుమార్ జైన్‌కు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్లను సేకరించాలని నిర్ణయించింది. ఈ విషయం సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్‌పెక్టస్(డీఆర్‌హెచ్‌పీ)లో వెల్లడించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు రాయితీతో కూడిన షేర్లను కేటాయించనున్నది సంస్థ. ఈ వాటాల విక్రయంతో వచ్చిన నిధుల్లో రూ.1,014.50 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి, కార్పొరేట్ అవసరాల నిమిత్తం వినియోగించనున్నట్టు ప్రకటించింది. 1985లో చెన్నైలో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన సంస్థ..ప్రస్తుతం తన స్టోర్ల సంఖ్యను 56కి పెంచుకున్నది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 22, తమిళనాడులో 20, కేరళలో ఏడు, తెలంగాణలో ఆరు, పుదుచ్చేరిలో ఒక్క స్టోర్‌ను నిర్వహిస్తున్నది. డిసెంబర్, 2024తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగా సంస్థ రూ.12,594.67 కోట్ల ఆదాయంపై రూ.262.33 కోట్ల నికర లాభాన్ని గడించింది.

వరుస లాభాలకు బ్రేక్.. ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటిక మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,680.79 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. అత్యల్పంగా 82,240.40 పాయింట్ల కనిష్టానికి తగ్గింది. చివరకు 53.49 పాయింట్లు పతనమై.. 82,391.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,160 షేర్లు పెరిగాయి. మరో 1,723 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ లాభపడగా.. ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పతనం కాగా.. ఐటీ ఇండెక్స్ 1.7 శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. పవర్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది.

ఆర్ఆర్ఎల్ఆర్, ఎంసీఎల్ఆర్‌లకు బ్యాంకర్ల కోత..

దిగొస్తున్న లోన్ టెన్యూర్, ఈఎంఐల భారం

10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింపులు

న్యూఢిల్లీ, జూన్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటును అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోను ఆర్బీఐ 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్‌లు రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఆర్ఎల్ఆర్) ఆధారిత రుణాలపై, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారిత లోన్లపై వసూలు చేస్తున్న వడ్డీరేట్లకు 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా కత్తెర వేశాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తమ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే వర్తిస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ తెలిపింది. ఆర్ఆర్ఎల్ఆర్ అనుసంధానంగా ఈ బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న రుణగ్రహీతలందరికీ ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ప్రస్తుతం బీవోబీ ఆర్ఆర్ఎల్ఆర్ 8.15 శాతంతో మొదలవుతున్నది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఎంసీఎల్ఆర్ అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ నెల 7 నుంచే తగ్గిన వడ్డీరేటు అమల్లోకి వచ్చింది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారంగా రుణాలు తీసుకున్న రుణగ్రహీతలకు ఈ నిర్ణయం లాభిస్తుంది. కాగా, ప్రస్తుతం ఓవర్‌నైట్, నెల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉన్నాయి. 3 నెలలది 8.95 శాతానికి, 6 నెలలు, ఏడాది టెన్యూర్ 9.05 శాతంగా ఉన్నాయి. రెండేండ్లు, మూడేండ్లు టెన్యూర్స్‌పై వడ్డీరేటు 9.10 శాతంగా ఉన్నది. ఇదిలావుంటే ఆర్ఆర్ఎల్ఆర్‌నూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయి. దీని ఆధారంగా రుణాలు తీసుకున్నవారికి వచ్చే నెల నుంచి ఈ లాభం అందనున్నట్టు తెలుస్తున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్.. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆర్ఆర్ఎల్ఆర్ 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింది.

సుహాస్ కొత్త సినిమా..గొర్రె పురాణం

టాలీవుడ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇటీవలే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్నవదనం సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సరికొత్త కథా, కథనాలతో వచ్చిన ఈ రెండు సినిమాలు కూడా మంచి విజయాన్ని సాధించాయి. ఇప్పుడు మరో వినూత్న కథతో ఆడియన్స్ ముందుకు రానున్నాడు సుహాస్. అదే గొర్రె పురాణం. బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా నుండి తాజాగా టీజర్ విడుదల చేశారు మేకర్స్. వినూత్న కథతో వస్తున్న ఈ టీజర్ చాలా కొత్తగా ఉంది. ఇప్పుడొక మీకొక బ్రేకింగ్ న్యూస్.. ఒక గ్రామంలో రెండు వర్గాల మధ్య ఒక గొర్రె చిచ్చు పెట్టింది. అనే వాయిస్ ఓవర్ తో స్టార్ట్ అయ్యింది ఈ టీజర్. తరువాత.. ఆ గొర్రె మాది అంటే మాది అని అంటూ హిందూ, ముస్లింలు వాదించుకుంటారు. అలా చిన్నగా మొదలైన గొడవ గ్రామ సమస్యగా మారుతుంది. ఇక సుహాస్ జైల్లో ఖైదీలా కనిపించారు. మరి సుహాస్ కి ఆ గొర్రె పిల్లకి ఏమైనా సంబంధం ఉందా అనేది ఆసక్తికరంగా మారింది. ఈ టీజర్ తో సినిమాపై మంచి ఇంట్రెస్ట్ క్రియేట్ చేశారు. మరి మరో కొత్త కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్నీన్ సాధిస్తుందో చూడాలి.

తెలుగులో కన్నా మళయాలమే బెటర్

సంయుక్త మీనన్

తెలుగు చిత్రసీమలోకి వచ్చిన కొంత కాలంలోనే విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు సంయుక్త. ప్రస్తుతం తెలుగుతోపాటు మలయాళ భాషల్లో వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్‌లో నటించాలంటే కష్టమన్నారు. 'మలయాళంతో పోలిస్తే తెలుగు సినిమాల్లో నటించాలంటే చాలా కష్టం. భాష రాకపోవడం ఒక కారణమైతే.. మేకప్ మరో కారణం. వినడానికి వింతగా ఉన్నా.. నా వరకు అది చాలా పెద్ద విషయం. మలయాళ సినిమాల్లో చేసేటప్పుడు మేకప్ వేసుకోవడం వెంటనే అయిపోతుంది. చాలా లైట్‌గా, సహజంగా వేస్తారు. యాక్టింగ్ చేసేటప్పుడు కూడా పూర్తి స్వేచ్ఛ ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ, టాలీవుడ్‌లో స్వీయ జాగ్రత్తలు చాలా తీసుకోవాలి. తెరపై ఎలా కనిపిస్తామా.. అని ఎప్పుడూ చూసుకుంటూ ఉండాలి. ఎక్కువ మేకప్ వేస్తారు. షాట్ చేస్తున్నప్పుడు కూడా మేకప్‌ను చెక్ చేసుకోవాలి. ఇది సౌకర్యానికి పూర్తి విరుద్ధం. చర్మం, ముఖంపై ఏదో ఉన్నట్లు అనిపిస్తుంటుంది' అని చెప్పారు. ప్రస్తుతం ఆమె తెలుగులో నిఖిల్ 'స్వయంభూ'లో నటిస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఇది రానుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా అత్యంత భారీ బ్జడెట్‌తో రూపొందుతోంది. దీనితో పాటు శర్వానంద్‌తోనూ ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా మూన్‌న్ పిక్చర్స్ పతాకంపై రానున్న సినిమాలోనూ ఈమెను ఓకే చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా చిత్రీకరణ జూన్‌లో ప్రారంభం కానుంది.

బాలీవుడ్ గుర్తించడం లేదన్న జ్యోతిక

తాజాగా 'శ్రీకాంత్' సినిమాతో ప్రేక్షకుల ముందుకువచ్చి ఆకట్టుకున్నారు జ్యోతిక. తెలుగు, తమిళ భాషల్లో వరుస చిత్రాల్లో నటించిన ఆమె బాలీవుడ్‌లో మాత్రం 27 ఏళ్ల తర్వాత నటించారు. 1997లో జ్యోతిక నటించిన హిందీ చిత్రం విడుదలైంది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'సైతాన్' అనే సినిమాతో ఈ ఏడాది బీటౌన్ ప్రేక్షకులను పలకరించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ లాంగ్ గ్యాప్ రావడానికి గల కారణాన్ని వివరించారు. 'తొలి చిత్రం ఫలితంపైనే మన కెరీర్ ఆధారపడి ఉంటుందని బలంగా నమ్ముతాను. నేను నటించిన మొదటి హిందీ సినిమా అనుకున్నంత స్థాయిలో ప్రేక్షకులను అలరించలేక పోయింది. దీంతో నాకు అక్కడ అవకాశాలు రాలేదు. దక్షిణాదిలో నేను నటించిన ఎన్నో సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందాను. అయినా.. బాలీవుడ్ నుంచి ఒక్క ఆఫర్ కూడా రాలేదు. ప్రేక్షకులు నన్ను దక్షిణాది నటిగానే గుర్తుంచుకున్నారు. అందుకే నాకూ బాలీవుడ్ చిత్రాల్లో నటించాలని ఆసక్తి లేదు' అని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, బొల్లాంట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ బొల్లా జీవితం ఆధారంగా తెరకెక్కిన 'శ్రీకాంత్'లో జ్యోతిక టీచర్ పాత్రలో కనిపించారు. సూర్య హీరోగా తెరకెక్కనున్న ఓ సినిమాలో జ్యోతిక నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'బెంగుళూరు డేస్' ఫేమ్ అంజలి మేనన్ ఆ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జ్యోతిక దీనిగురించి మాట్లాడుతూ సరైన స్క్రిప్ట్ కోసం చర్చలు జరుపుతున్నామన్నారు. మంచి కథ ఉంటే సూర్యతో కచ్చితంగా కలిసి నటిస్తానని స్పష్టంచేశారు.

రవితేజ వారసుడు మాధవ్ హీరోగా.. మిస్టర్ ఇడియట్

మాస్ మహరాజ్ రవితేజ వారసుడు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా 'మిస్టర్ ఇడియట్' ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై శ్రీమతి యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జె జె ఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'పెళ్లి సందడి' చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. తాజాగా శుక్రవారం 'మిస్టర్ ఇడియట్' చిత్రం టీజర్ ను రవితేజ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ఈ టీజర్ ను చూస్తే.. ధృవ ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజీలో చదివే సత్య (హీరోయిన్ సిమ్రాన్ శర్మ) కాలేజ్ టాపర్. ఆమె డిజైన్ గీస్తే ది బెస్ట్ గా నిలవాల్సిందే. కాలేజ్ లో సత్య మెరిట్ ను బీట్ చేయడం ఎవరి వల్లా కాదు. అలాంటి టైమ్ లో కాలేజ్ లో అడుగు పెడతాడు హీరో (మాధవ్). సత్యను న గుణింతంతో పిలుస్తూ సరదాగా టీజ్ చేస్తుంటాడు. హీరోయిన్ ను హీరో గుణింతంతో ఎందుకు పిలుస్తున్నాడు? అల్లరిగా సాగే వీరి స్నేహం ప్రేమగా ఎలా మారింది ? అనేది టీజర్ లో ఇంట్రెస్టింగ్ గా చూపించారు. మాధవ్ రవితేజ లా ఎనర్జిటిక్ గా కనిపించాడు. స్టైలిష్ లుక్స్ తో పాటు పర్ ఫార్మెన్స్ లోనూ ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'మిస్టర్ ఇడియట్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.

పగ..ప్రతీకారం..కృష్ణమ్మ మూవీ

జయాపజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు సత్యదేవ్. కానీ, కొన్నాళ్లుగా ఆయన నుంచి వచ్చిన ఏ సినిమా హిట్టు మాట వినిపించలేకపోయింది. దీంతో ఈసారి విజయమే లక్ష్యంగా 'కృష్ణమ్మ'తో బాక్సాఫీస్ బరిలో అడుగు పెట్టారు. దీనికి ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం.. పాటలు, ప్రచార చిత్రాలు ఆకట్టుకునేలా ఉండటంతో ప్రేక్షకుల చూపు ఈ సినిమాపై పడింది. అనాథలైన భద్ర (సత్యదేవ్), శివ (కృష్ణ బూరుగుల), కోటి (లక్ష్మణ్ మీసాల) చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు. చిన్నతనంలోనే జైలు జీవితం గడిపిన శివ బయటకొచ్చాక ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. భద్ర, కోటి మాత్రం గంజాయి స్మగ్లింగ్ చేసి పొట్ట నింపుకొంటుంటారు. వీళ్లంతా తమకంటూ ఓ కుటుంబం ఉండాలని ఆశ పడతారు. ఈ క్రమంలోనే మీనా తో శివ ప్రేమలో పడతాడు. ఆమె భద్రకు రాఖీ కట్టడంతో తనూ ఆమెను సొంత చెల్లిగా చూడటం మొదలు పెడతాడు. ఆ తర్వాత స్మగ్లింగ్ వంటి తప్పుడు పనులు మానేసి ఆటో నడుపుతూ సొంత కాళ్లపై నిలబడే ప్రయత్నం చేస్తాడు భద్ర. అయితే ఓసారి మీనా తల్లి ఆపరేషన్‌కు రూ. 2లక్షలు అవసరమైతే.. ఆ డబ్బు సంపాదించడం కోసం భద్ర, శివ, కోటి తప్పనిసరి పరిస్థితుల్లో గంజాయి స్మగ్లింగ్ చేయడానికి సిద్ధపడతారు. సరిగ్గా అప్పుడే వాళ్లు అనుకోకుండా ఓ యువతి హత్యాచారం కేసులోనూ ఇరుక్కుంటారు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్యాచారానికి గురైన అమ్మాయి ఎవరు? ఈ కేసు ఏమిటన్నది తెలియకుండానే దాన్ని భద్ర, కోటి, శివ తమపై వేసుకోవడానికి కారణమేంటి? కేసు గురించి తెలిశాక ఈ ముగ్గురు ఏం చేశారు? శివని పెళ్లి చేసుకోవాలని ఎదురు చూస్తున్న మీనా ఏమైంది? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. స్నేహంతో ముడిపడి ఉన్న ప్రతీకార కథ ఇది. బలమైన భావోద్వేగాలతో రా రస్టిక్ కోణంలో సాగుతుంది. అయితే ఈ అసలు కథలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లడానికి దర్శకుడు చాలా సమయమే తీసుకున్నాడు. ఈ మధ్యలో హీరోకి ఓ చిన్న లవ్‌ట్రాక్ తగిలించే ప్రయత్నం చేశారు దర్శకుడు. కానీ, అదీ ఏమాత్రం మెప్పించదు. విరామానికి ముందు భద్ర తన మిత్రులతో కలిసి గంజాయి స్మగ్లింగ్‌కు సిద్ధమవడం.. దాన్ని తీసుకొచ్చే క్రమంలో పోలీసులకు దొరికిపోవడం.. అదే సమయంలో అనుకోకుండా ఓ హత్యాచారం కేసును తమపై వేసుకోవడంతో అసలు కథ మొదలవుతుంది. ఇక్కడి నుంచి ద్వితీయార్ధమంతా సీరియస్ టోన్‌లో సాగిపోతుంది. హత్యాచారానికి గురైన యువతి ఎవరన్నది తెలిశాక భద్ర, కోటి, శివ పోలీసులపై తిరగబడే సన్నివేశాలు ఆసక్తిరేకెత్తిస్తాయి. పోలీసులు వాళ్లని చిత్రహింసలకు గురి చేసి బలవంతంగా ఆ కేసును ఒప్పించే సీక్వెన్స్ 'జైభీమ్', 'విచారణ' చిత్రాల్ని గుర్తు చేస్తుంది. భద్ర, కోటి జైలు నుంచి బయటకు వచ్చాక చేసే వరుస హత్యలు థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ముగింపు ఊహలకు తగ్గట్లుగా ఉన్నా.. పతాక సన్నివేశాలు భావోద్వేగభరితంగా అనిపిస్తాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com